ప్రజాశక్తి

Vol. 6, no. 24

(Jun. 13, 1945)

బెజవాడ, 1945

Prajāśakti

Vol. 6, no. 24

(Jun. 13, 1945)

Bejavāḍa, 1945

Record no. 683

Reqd. No M. 4486 0-2-0

ప్రజాశక్తి

సంపుటి 6 బుధవారం 13-6-45 సంచిక 24

తరతరాల దాస్యంనుండి చైతన్యవంతు లవుతున్న నిమ్నజాతులు

మన ఆంధ్రదేశంలో "అంటరానివారు"గా పరిగణింపబడే నిమ్నజాతుల ప్రజలు సాంఘికంగాను, ఆర్థికంగాను, ఎన్నెన్ని బాధలకు, అవమానాలకు గురి అవుతున్నారో మనం చూస్తున్నాం. వీధుల్లో స్వేచ్ఛగా తిరగడానికివీలులేదు. బావులవద్ద మంచినీళ్లు తోడుకు తాగడానికి హక్కులేదు. గ్రామపాఠశాలల్లోకి వీరి పిల్లల్ని రానీయరు. భూస్వాములు ఒకరిపైఒకరు కక్షలు సాధించుకోడానికి వీరిని ఆటవస్తువులుగా ఉపయోగించు కుంటారు. వీరికిచ్చే కూలి బహుతక్కువ. అదైనాచాలా ప్రాంతాల్లో పిచ్చుముంతలతో కొలుస్తారు. బండబూతులు, వెట్టిచాకిరి, నిర్బంధ చర్యలు -ఇవి నిత్యనైవేద్యాలు. అవిద్య, మూఢనమ్మకాలు, చెడుఅలవాట్లు వీరిని మరింత కృంగదీస్తున్నాయి. వీరిలోనే వీరికి ఎన్నో కులకక్షలు, చీలికలు, వైషమ్యాలు!

నిమ్నజాతుల ప్రజల్ని యీ దారుణ స్థితినుంచి రక్షించి, సంఘంలో గౌరవస్థానం లభించేలా చేయడానికి 1917 లో ఆంధ్రరాష్ట్రీ ఆదిమాంధ్ర సంఘంఏర్పడింది. చైతన్యవంతులైన కొందరువిద్యార్థికులు దాన్నిస్థాపించారు

సహాయ నిరాకరణోద్యమం

1921 లో సహాయ నిరాకరణోద్యమం వచ్చింది. అస్పృశ్యతా నివారణ కాంగ్రెసు కార్యక్రమంలో ఒకభాగంగా ఉండడంచూచి, వీరిలో ఎక్కువమంది కాంగ్రెసు సభ్యులుగా చేరారు. కొంతమంది జిల్లాకాంగ్రెసు కమిటీలకు, రాష్ట్రకాంగ్రెసు కమిటీకి, సభ్యులుగా కూడా ఎన్నుకోబడ్డారు. కుసుమ వెంకట్రామయ్యగారు 1922--24 వరకు, కుసుమ ధర్మన్నగారు 1924—1926 వరకు, అఖిల భారత కాంగ్రెసు కమిటీలో సభ్యులు.

అయితే, నిమ్నజాతుల్లో కొత్తగా రేకెత్తిన చైతన్య స్థాయికి అనుగుణ్యమైన కార్యక్రమ మేదీ కాంగ్రెసు యివ్వలేదు. స్థానిక కాంగ్రెసు నాయకులు ఉపన్యాస వేదికలపై దీర్ఘోపన్యాసాలివ్వడంతప్ప, సోదర భావంతో వారి హక్కులకై పోరాడలేదు.

దీనితో చదువుకున్న ఆదిమాంధ్ర యువకులు కళ్ళు తెరిచారు. దేశానికి స్వరాజ్యం వచ్చినా, తమస్థితి యిలాగేవుంటుంది కాబోలునని భావించసాగారు. కొందరు కాంగ్రెసుపై ధ్వజం యెత్తనారభించారు. బ్రిటిష్‌ప్రభుత్వం, కొత్త రాజ్యాంగ సంస్కరణలలో నిమ్నజాతులకు ప్రత్యేక నియోజక వర్గాలుండాలని నిశ్చయించి నప్పుడు, గాంధీమహాత్ముడు దేశైక్యతను చీల్చడానికి యిదొక పన్నాగమని భావించి, ఉపవాసం చేశారు. ప్రత్యేక నియోజక వర్గాలద్వారాఅధమాధమస్థితిలోనున్న అస్పృశ్యులుతమహక్కులకై పోరాడగలశక్తిసంతులు, చైతన్యవంతులు అవుతారని గాంధీజీ గుర్తించలేక పోయారు. దీనితో నిమ్నజాతి నాయకులు పూర్తిగా అసంతృప్తి చెంది, కాంగ్రెసుతో సంబంధం [illegible] సాగారు. గాంధీజీ, ఉపవాసం అనే అస్త్రంతో తమ నాయకుని లొంగ దీశాడని క్రోధావేశులయారు. అప్పటినుంచి తమకొక ప్రత్యేక సంస్థ ఉండితీరాలని గుర్తించి, అఖిలభారత నిమ్నజాతుల సంఘంలో పనిచేయ నారంభించారు.

1936 లో అసెంబ్లీ ఎన్నికలొచ్చాయి. నిమ్నజాతివోటర్లు ఎక్కువమంది కాంగ్రెసు అభ్యర్థుల్ని గెలిపించినప్పటికీ, రాజకీయ చైతన్యంతో యిచ్చిన వోట్లుకావు, అవి. తమ నిత్యజీవితంలో అగ్రజాతుల దయాదాక్షిణ్యాల మీద ఆధారపడియుండడంవల్ల తప్పనిసరిగా అగ్రజాతులు చెప్పినప్రకారంవోటుచేయవలసి వచ్చింది. కాంగ్రెసు మంత్రులు వీరి విషయంలో అంతగా పట్టించుకోనందున, కాంగ్రెసుకూ-నిమ్నజాతులకు మధ్య అప్పటికేఉన్న అగాధం మరింత పెరిగింది. వీరి నాయకులు కాంగ్రెసుకు వ్యతిరేకంగా ప్రచారం చేయనారంభించారు. ఉపన్యాసాలద్వారా పల్లెలలో అగ్రజాతుల దౌర్జన్యాన్ని తూర్పారబెట్టేవారు. కొందరు బ్రిటిష్‌ప్రభుత్వం పట్లభ్రమలు కూడా వ్యాపింప జేశారు.

దీనితోబాటు, గతఅయిదారు సంవత్సరాలనుంచి కృష్ణా, గుంటూరు, నెల్లూరు, ఉభయ గోదావరి జిల్లాలలో జిల్లా వ్యవసాయ కూలీ సంఘాలద్వారా కమ్యూనిస్టులు, యితర తీవ్రవాదులు నిమ్నజాతి ప్రజలలో-ఆర్థికరాజకీయ చైతన్యాన్ని పెంపొందింపజేస్తూ, సవర్ణ-అవర్ణ కూలీల మధ్య ఐక్యతను నిర్మించడంద్వారా వారి ఆర్థిక రాజకీయ సమస్యలను పరిష్కరిస్తున్నారు. ఎన్నోపోరాటాలలో కూలీసంఘ నాయకులు నిమ్నజాతులకు ముందుండి మార్గదర్శకులయారు.

ఈపరిస్థితుల్లో జరిగింది, ఆంధ్రరాష్ట్ర నిమ్నజాతుల ప్రథమ మహాసభ, కొవ్వలిలో.

నేను 2-6-45న తేదీ ఉదయానికి కొవ్వలి చేరాను. వచ్చిన నాయకుల్నీ, విద్యార్థికుల్నీ, ఒక రొకరినే కలుసుకున్నాను.

మహాసభకు వచ్చిన ప్రముఖులు

ఆహ్వాన సంఘాధ్యక్షులు, నక్కాచిన వెంకయ్యగారు, కాంగ్రెసులో 15 సంవత్సరాలు పనిచేశారు. 1932 శాసనోల్లంఘనోద్యమములో తీవ్రమైన లాఠీఛార్జికి గురి అయారు. ఆహ్వానసంఘ కార్యదర్శి సిద్దాబత్తుల ప్రకాశరావు 20 యేళ్ళ యువకుడు. ఇంటర్మీడియట్ ప్యాసయాడు. ఆళ్ళచెలమదాసుగారు 1921-39 వరకు కాంగ్రెసులో ఉండి, తరవాత రాజీనామా యిచ్చారు. స్వతన పల్లిలో హరిజన హాస్టల్‌కి మేనేజరుగా ఉంటున్నారు. రాష్ట్రీ నిమ్నజాతుల ఫెడరేషన్‌కి సహాయ కార్యదర్శి. వాలంటీర్ కెప్టెన్ నేతల పోతురాజుఏలూరుతాలూకావ్యవసాయ కూలీ సంఘకార్యదర్శి. పి. బాలకృష్ణగారు రాజమండ్రి "నవభారత గురుకులం"లో అధ్యాపకులుగా ఉంటున్నారు. చక్కని కవిత్వం రాస్తారు. ప్రబోధ సాహిత్య సమితికి కార్యదర్శిగా ఉన్నారు. ఎన్. శ్రీహరిగారు ఇంటరుచదివి, ప్రస్తుతం నేషనల్ వార్ ఫ్రంటు ఆర్గనైజరుగా నెలకు రు. 325 జీవితం సంపాదిస్తున్నారు. గుంటూరు బాపనయ్యగారు కృష్ణాజిల్లా వ్యవసాయ కూలీ సంఘాధ్యక్షుడు, కమ్యూనిస్టు. దోనే తాతయ్యగారు తీవ్రమైన నాస్తికవాది; కృష్ణాజిల్లా కాంగ్రెసు అసెంబ్లీలో సభ్యుడు. కాకుళ్ళ రాఘవులుగారు ఎం. బి. బి. ఎస్. పరీక్షకు మద్రాసులో చదువుతున్నారు. రామానుజయ్యగారు బెజవాడలో వేముల కూర్మయ్యగారి హరిజన బాలికావసతి గృహంలో ఒక గుమాస్తా. లంకపల్లి వెంకట్రామయ్యగారు కృష్ణాజిల్లావ్యవసాయకూలీసంఘానికి సహాయ కార్యదర్శి. రేవులగడ్డ ఏసుపాదంగారు జిల్లాబోర్డు టీచరు; పశ్చిమగోదావరి జిల్లాలో వ్యవసాయకూలీఉద్యమ నాయకుల్లో ఒకరు. మత్తే నరసింహంగారు ఎల్. సి. పి. ఎస్. (కలకత్తా) వైద్యపరీక్షకు చదువుతున్నారు. కుసుమ వెంకట్రామయ్యగారు మాజీ అ. భా. కాంగ్రెసుకమిటీ సభ్యుడు. ప్రస్తుతం నేషనల్ వార్‌ఫ్రంటు ఆర్గనైజరు. పి. గోపాలకృష్ణగారు రాజమండ్రిలో ఎడ్వొకేట్. వస్కా సుబ్రహ్మణ్యంగారు, సీలం వెంకయ్యగారు, ప. గో. జిల్లాబోర్డు మెంబర్లు. వీరుగాక, వానే నాగేశ్వరరావుగారు, నంబూరి శ్రీనివాస రావుగారు, నంబూరి దూర్వాసరావుగారు, పి. శేషమాంబగారు, దగ్గుమిలి సుబ్బారావుగారు, యాళ్ళజట్ల బాబుగారు, మేడుగు వెంకయ్యగారు-మొదలైన యినకవులెందరో మహాసభకు వచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి 300 మంది విద్యార్థులు, 100 మంది ఉపాధ్యాయులు, 20 మంది ప్రభుత్వోద్యోగులు ప్రేక్షకులుగా వచ్చారు. రాజమండ్రి, రామచంద్రపురం, రాజోలు, నరసాపురం తాలూకాలనుంచి స్త్రీలు 15 గురు వచ్చారు. కృష్ణా, గుంటూరు, నెల్లూరు, విశాఖ, ఉభయగోదావరి జిల్లాలనుంచి రాష్ట్రమహాసభకు మొత్తం 50 మంది ప్రతినిధులువచ్చారు.

మా విలేఖరి

మహాసభకు ఆటంకాలు

మహాసభ కొవ్వలితో జరగకుండా చేయడానికి ఎన్నెన్నో ప్రయత్నాలు జరిగాయి. మరోగ్రామానికి మారిస్తే రు. 600 యిస్తామని కొవ్వలి భూస్వాములు వాగ్దానంచేశారు. కాని కార్య నిర్వాహక వర్గం యీ "వాగ్దానాన్ని" స్వీకరించలేదు. తరవాత బెదరింపులు ప్రారంభించారు. జెండాలు పీకివేస్తామన్నారు. పందిళ్లు తగలపెడతామన్నారు. కాని కార్యవర్గం లొంగలేదు. అఖరికి జిల్లా అధికారులకు, మహాసభ జరిగితే కూలీఅంతా సమ్మెలు చేస్తారని, రైతుల భూముల్ని స్వాధీనం చేసుకుంటారని, అరాజకం ప్రబలుతుందని-తప్పుడురిపోర్టులుపంపి, సభను నిషేధించేటట్టు చేయడానికి ఎత్తువేశారు. మరోవైపు తాలూకా (ఏలూరు) కాంగ్రెసు అసెంబ్లీ వారి సహాయం అర్థించారు. తాలూకా కాంగ్రెసు అసెంబ్లీ భూస్వాముల మాటలకు చెవియొగ్గి 1-6-45న అనగా మహాసభకు తొలిరోజున, సమావేశమై రైతుల హక్కులకు అరాజకంజరగకుండా చేయమని, భంగం కలిగించకుండాచూడమని, ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానించింది. మహా సభకు సరిగా తొలిరోజున తాలూకా అసెంబ్లీ యిట్టి తీర్మానం చేయడంలో ఉద్దేశ (మిగతా 2న పేజీలో)

నిమ్న జాతుల న్యాయమైన కోర్కెలు

(1వ పేజీ తరువాయి) నేమైవుంటుందో పాఠకులే ఊహించుకోవాలి. చివరకి పోలీసు అధికారులు, రిజర్వుదళం, కూడా హాజరయ్యారు.

ఇన్ని ఆటంకాలను దాటవలసి వచ్చింది. ఆహ్వానసంఘం మహాసభజరపడానికి. ఐనా, నిమ్నజాతుల ప్రజల్లో ఫెడరేషన్‌పట్ల గల గాఢాభిమానం ఇంతా అంతా అని చెప్పడానికి వీలులేదు. మహాసభకు 40 గ్రామాల్లో మొత్తం రు. 700 వసూలయింది. 7 బస్తాల బియ్యం సప్లయి చేశారు.

పశ్చిమ గోదావరిజిల్లాలో ఆదిమాంధ్ర సంఘానికి కార్యదర్శిగా ఉంటూ, నిమ్న జాతులఅభివృద్ధికి పాటుపడిన నాయకుల్లో ఒకరైన నరహరిసెట్టి దేవేంద్రుడుగారు దాదాపు 10 సంవత్సరాల క్రితం చనిపోయినారు. వారి స్మారక చిహ్నంగా మహాసభా పరణకు "దేవేంద్ర నగర్" అని పేరు పెట్టారు. సింహద్వారం పేరు ఎం. సి. రాజా గేటు. సభాప్రదేశంలో నిమ్నజాతుల కోర్కెలను తెలియజేసే నినాదాలు అట్టలమీదరాసి, ఎత్తుగా కట్టారు. వాటిలో కొన్ని "ధనికతత్వం నశించాలి" "వ్యవసాయ కూలీలంతా ఏకం కావాలి" "పాలేళ్ళబత్యం హెచ్చించాలి" "హిందూమత నిరంకుశత్వం నశించాలి."

యువజన మహాసభ

2-6-45వ తేదీ సాయంత్రం 6 గంటలకు 1000 ప్రేక్షకుల సమక్షంలో రాష్ట్ర నిమ్నజాతుల యువజన మహాసభ ప్రారంభమైంది. నేతల పోతురాజు ప్రారంభోత్సవం జరుపుతూ, నిమ్నజాతులు తమ న్యాయమైన కోర్కెలను సాధించుకోవాలంటే తమలో తమకుగల విభేదాలు, కక్షలు, నిర్మూలించుకొని సంఘీభావంతో పని చేయాలని ఉద్బోధించాడు. అధ్యక్షుడు పి. బాలకృష్ణగారు నిమ్నజాతులక్రోధాగ్నితో అగ్రజాతుల నిరంకుశత్వం దగ్ధమయే రోజులు దగ్గర పడ్డాయని ఉద్రేకపూరితంగా ఉపన్యసించారు. డాక్టర్ అంబేద్కర్ చెప్పినట్లు, యువకులు విద్యద్వారాను, ఆందోళన ద్వారాను, నిర్మాణం ద్వారాను, నిమ్నజాతి ప్రజల్లో చైతన్యం కలుగజేస్తే, తప్పక తమ వాంఛలు యీడేరుతాయని తెలియచేశారు. తరువాత, లంకపల్లి వెంకట్రామయ్యగారు నిమ్నజాతి యువకులకు చక్కని కార్య క్రమం సూచించారు. నిమ్నజాతులలో ప్రస్తుతంఉన్న కుల కక్షలను పరిష్కరించాలన్నారు. గొంతేమ్మ పండగ, త్రాగుడు, జూదం మొదలైన దురలవాట్లను రూపుమాపాలన్నారు. వయోజన విద్యద్వారా వారిని చైతన్యవంతులుగా చేయాలన్నారు. ఫెడరేషన్ యొక్క కార్యక్రమాన్ని గ్రామాలలో ప్రచారం చేయాలన్నారు. రాజకీయ గ్రంధాలు చదివి వివిధ దేశాల స్వాతంత్ర్యోద్యమాలను పరిశీలించాలన్నారు. ఎన్. శ్రీహరిగారు తరవాత ఉపన్యసిస్తూ, ఈ మహాసభ ఏవోకొన్ని తాత్కాలిక సౌకర్యాలకోసం కాదనీ, అధమాధములై యున్న నిమ్నజాతుల హక్కుల్ని ప్రకటించడానికేననీ, తెలియజేశారు. భూస్వాముల తప్పుడు రిపోర్టులు విని స్థానికాధికారులు పోలీసుల్ని మహాసభలో కాపలా పెట్టవలసిన అవసరం లేదన్నారు. తాను ప్రభుత్వోద్యోగిగా ఉన్నా, తన సోదరప్రజల హక్కులకై నిరంతరకృషి చేస్తానని తెలియజేశారు.

నేతల సువర్ణరాజుగారు, గా. నాగేశ్వరరావుగారు కూడ ఉపన్యసించినతరవాత రాష్ట్ర యువజనసంఘానికి ఒక కార్యనిర్వాహకవర్గం ఎన్నుకోబడింది. పి. బాలకృష్ణగారు అధ్యక్షుడు; పద్దాల మోహనరావుగారు ఉపాధ్యక్షుడు; దగ్గుమిల్లి సుబ్బారావుగారు కార్యదర్శి; వాసే నాగేశ్వరరావుగారు సహాయ కార్యదర్శి.

నిమ్నజాతిస్త్రీల కోర్కెలు

ఆరోజే రాత్రి 9 గంటలకు రాష్ట్ర నిమ్న జాతుల మహిళా మహాసభ ప్రారంభమైంది. ఏడెనిమిది వందలస్త్రీలు దీనికి హాజరయారు. మరోవేయిమంది పురుషులువచ్చారు. నంబూరి పరిపూర్ణ మహాసభకుప్రారంభోత్సవంచేసింది. అధ్యక్షత వహించిన పి. శేషమాంబగారు రష్యాలో విప్లవానికిముందు స్త్రీలెలాంటిస్థితిలో ఉండేవారో అలాంటి స్థితిలోనే నేటి మన నిమ్నజాతులస్త్రీలుకూడా వున్నారనిచెప్పారు. ప్రపంచమంతా ప్రజాపెల్లువఉరకలు వేస్తూ పరుగెడుతోందన్నారు. నిర్బంధ ప్రాధమికవిద్య, బాలికావసతి గృహాలు, ప్రసూతి సౌకర్యాలు మొదలైన సౌకర్యాలకొరకుస్త్రీలంతాప్రభుత్వం మీద ఒత్తిడి తేవాలన్నారు. అవసరమైతే ప్రభుత్వాన్ని కూలద్రోయాలన్నారు. కొవ్వలి గ్రామానికి చెందిన శ్రీమతి అన్నపూర్ణ స్త్రీలనికృష్టజీవితాన్ని కళ్ళకు కట్టినట్లు వర్ణిస్తూంటే, నాప్రక్కన కూర్చున్న ప్రేక్షకులు "మన పందులోళ్ళ అమ్మాయేరా!" అంటూ ఆశ్చర్యం వెలిబుచ్చారు.

25వందలమందితో ఊరేగింపు

మరునాడు, అంటే 3 వ తేదీని, మధ్యాహ్నం 4 గంటలకు బ్రహ్మాండమైన ఊరేగింపు బయలు దేరింది. 2000 మంది పురుషులు, 500 మంది స్త్రీలు, బారులు తీరి "రండో రండో నిమ్న జాతుల్లారా రండో రండో రండీ వేవేగ!"అని పాటలు పాడుతూ కొవ్వలి గ్రామవీధుల్లో నడుస్తూంటే, భూస్వాముల వెకిలినవ్వులు, వెటకారాలు, ప్రత్యక్షమయాయి. "అంటు దోషం నశించాలి!" "డాక్టరు అంబేద్కర్‌కీజై" "నిమ్నజాతుల ఫెడరేషన్‌కీజై!" మొదలైన నినాదాలతో దిక్కులు పిక్కటిల్లుతుంటే, ఒక భూస్వామి భార్యకాబోలు ఊరేగింపులో నడుస్తున్న ఒక పాలేరు నుద్దేశించి, "ఇంతకాడికి తీసుకొచ్చావట్రా?" "అని వాపోయింది." "పిచ్చుమంతలు నశించాలి" "బందబూతులు పనికిరావు!" "హిందూనిరంకుశత్వం నశించాలి!" అంటూ ఊరేగింపులో నినాదాలు మార్మోగుతుంటే, పైనిక దుస్తుల్లోవున్న ఒక పూళ్ళ వ్యవసాయ కూలీ చెయ్యిపైకెత్తి, కంఠం ఓంచుకొంటూ, "పిచ్చుమంతలు నశించాలి!" "బందబూతులు పనికిరావు!" "హిందూ నిరంకుశత్వం నశించాలి!" అని గొంతు కలుపుతున్నాడు.

ఊరేగింపు మొత్తం ముప్పాతిక మైలు పొడవుంటుంది. వీధులన్నీ తిరిగి, సభావరణకుచేరుకొంటూంది"V"ఆకారంలోఉన్నఒక ప్రదేశాన్ని ఊరేగింపు చుట్టుతిరిగివస్తూంటే, కొత్తూరులో ఊరేగింపు చివరభాగం, లైబ్రెరీ వద్ద మొదటిభాగం ఒకేసారి చూడగలిగాను.

ఫెడరేషన్ మహాసభ

ఊరేగింపు పూర్తిఅయాక రాష్ట్ర ఫెడరేషన్ మహాసభ ప్రారంభమయింది. 3000 మంది స్త్రీ పురుషులు వారివారి స్థానాల్లో కూచున్నారు. నంబూరి సోదరులు(శ్రీనివాసరావు, దూర్వాసరావు) రచించిన గేయాలు కొన్ని చదివిన తరవాత, కృష్ణాజిల్లా వ్యవసాయ కూలీ సంఘాధ్యక్షుడు, కమ్యూనిస్టుపార్టీ సభ్యుడు, అయిన గుంటూరు బాపనయ్యగారు పతాకోత్సవం జరిపారు. "ఈ రోజునుంచి ఆంధ్ర రాష్ట్రంలో షెడ్యూల్డ్‌జాతుల పతాకం క్రింద ఒక పెద్ద ప్రజా ఉద్యమం ప్రారంభమైం"దని చెప్పారు. ఈజండాప్రతిష్ఠించబడకపూర్వం నిమ్నజాతుల్లో ఏకీభావం, స్పష్టమైన కార్యక్రమం ఉండేవికావన్నారు. ఇకముందు అలా కాక సంఘీభావాన్ని నెలకొల్పుకొన్నామని, ఉద్బోధించారు.

తరవాత ప్రముఖుల సందేశాలు చదువబడ్డాయి. కుసుమ ధర్మన్నకవిగారు, ఏలూరు తాలూకా రైతుసంఘ కార్యదర్శి అన్నే వెంకటేశ్వరరావుగారు, గొల్లపల్లి శామ్యూల్‌గారు మహాసభయొక్క విజయాన్ని కోరుతూసందేశాలు పంపారు.

ఆహ్వానసంఘాధ్యక్షుడైన నక్కా చినవెంకయ్యగారు ప్రేక్షకుల్ని, ప్రతినిధుల్ని,ఆహ్వానిస్తూ మొదటినుంచీ యీ మహాసభ జరక్కుండా చేయడానికి చేయబడిన ప్రయత్నాలను వివరించి, లంచాలకు, బెదరింపులకు రోజులు గతించాయని చెప్పారు. మహాసభాధ్యక్షుడు ఈలి వాడపల్లిగారు లేచి నిలబడగానే హర్షధ్వానాలు మిన్నుముట్టాయి. వీరు రామచంద్రపురంలో "ఆదిశక్తి" అనే మాస పత్రికకు సంపాదకులుగా ఉంటూ, స్థానిక ఆదిమాంధ్ర హాస్టల్‌కి మేనేజరుగా పనిచేస్తున్నారు. చాలా నిరాడంబరజీవి తన జాతిని పైకి తీసుకురావడానికి అష్టకష్టాలు పడుతున్నారు. వాడపల్లిగారు తమ అధ్యక్షోపన్యాసంలో, ఇప్పుడు స్వరాజ్యోద్యమాన్ని నడిపేవారంతా అగ్రజాతులకు చెందిన ధనవంతులనీ, అందువల్ల వారుకోరే స్వరాజ్యం నిమ్నజాతులహక్కుల్ని కాపాడజాలదనీ చెప్పారు. అ. భా. నిమ్నజాతుల ఫెడరేషన్ కోరుతూన్న కోర్కెలకుయితరరాజకీయపార్టీలు,ప్రభుత్వం అంగీకరించవలసి యుంటుందనీ చెప్పారు. ప్రత్యేకనియోజకవర్గాలు,ఇప్పటికంటె ఎక్కువ ఉద్యోగాలు, విద్యాసౌకర్యాలు, ప్రత్యేక సెటిల్మెంట్లు, కావాలన్నారు. అఖిలభారత ఫెడరేషన్ అంగీకరించని యేరాజ్యాంగ విధానాన్ని అమలుజరపడానికి వీల్లేదని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఇంగ్లండు హోటల్సులో భారతీయులకు జరిగే అవమానాలను ఒకవైపు ఖండిస్తూ, మరోవైపు మన దేశంలోనే నిమ్మజాతుల ప్రజలకు నిత్యమూ జరిగే అవమానాలకు నోరెత్తని జాతీయ పత్రికల ధోరణిని నిరసించారు.

తరువాత అళ్ళ చెలమదాసుగారు లేచి, అధమాధమస్థితిలో అణచబడియున్న జాతుల స్వాతంత్ర్యంకోసం పనిచేసే తెనుగుపత్రికలు "ఆదిశక్తి" "ప్రజాశక్తి" మాత్రమేనని తమ ఉపన్యాసంలో పేర్కొన్నాడు. ప్రభుత్వం సహగమనాన్ని నేరంగా ప్రకటించి నట్లే అస్పృశ్యతనుకూడా నేరంగా ప్రకటించాలని వి. గోపాలకృష్ణ, ఎడ్వొకేట్,గారు సూచించారు. వస్కా సుబ్రహ్మణ్యంగారు ప్రభుత్వ బంజర్లను వ్యవసాయాని కియ్యడంలో అగ్రజాతికి చెందిన భూస్వాములు, స్థానికాధికారులు అవలంబించే పక్షపాత ధోరణిని తీవ్రంగా నిరసించారు గుంటూరు బాపనయ్యగారు కృష్ణాజిల్లా వ్యవసాయకూలీ మహాసభ అ. భా. నిమ్నజాతుల ఫెడరేషన్ కోర్కెలను ఏకగ్రీవంగా బలపరిచిందనీ, కమ్యూనిస్టుపార్టీ కూడ సహకారం చేయడానికి సిద్ధంగా వుందనీ, తెలియజేశారు.

తరవాత కోటే పుట్టయ్యగారు, పీలం వెంకయ్యగారు, వి. వీరయ్యగారు,మత్తే నరసింహంగారు, ఉపన్యసించారు. ఎన్. శ్రీహరిగారు, షెడ్యూల్డు జాతుల ఫెడరేషన్ అగ్రజాతుల నిరంకుశత్వానికిమాత్రమేగాక, బ్రిటిష్ సామ్రాజ్యవాదానికికూడా వ్యతిరేకమేనన్నారు.

తీర్మానాలు

అంబేద్కరు నాయకత్వంపట్ల విశ్వాసం ప్రకటిస్తూ, అ. భా. నిమ్నజాతుల ఫెడరేషన్ కోర్కెలను బలపరుస్తూ, తీర్మానాలు ఏకగ్రీవంగా ఆమోదింపబడ్డాయి. పంగిడిగూడెం జమిందారు నిమ్నజాతుల కూలీలపై జరిపే నిరంకుశ చర్యలను ఖండించారు.

తరువాత జరిగిన రాష్ట్రవిద్యార్థి మహాసభ ఆంధ్ర రాష్ట్రంలో ప్రస్తుతమున్న హరిజన హాస్టళ్ళలో విద్యార్థులకు భోజనవసతి సరిగా లేదని, ప్రభుత్వం ఈవిషయంలో జోక్యంకలిగించుకుని జిల్లా ఫెడరేషన్లకు వాటిని వప్పజెప్ప వలసిందని (మిగతా 10 వ పేజీలో)

> ## స్వతంత్ర భారత దేశంలో
> ## నిమ్నజాతుల స్థానం
>
> "స్వతంత్ర భారతదేశ పరిపాలనలో మనజాతి కూడ భాగస్వామిగాఉండాలి. ఇప్పటివలె అప్పుడుకూడామనల్ని అణచియుంచే పద్ధతికి అంగీకరించ కూడదు. నౌకర్లహోదా మనకప్పుడు ఉండకూడదు."
>
> — డాక్టరు అంబేద్కర్
> 53 వ జన్మదిన సందేశం.

వైస్రాయి కొత్తప్రతిపాదన లేమిటి?

కాంగ్రెసునాయకుల్ని విడుదలచేసి, ప్రతిష్టంభన అంతంజేయాలి

వైస్రాయి, వేవెల్ 10 వారాలు లండన్‌లోఉండి, తిరిగి భారతదేశానికి వచ్చాడు నేడో రేపో ప్రతిష్టంభన పరిష్కారానికి కొన్నిసూచనలు చేస్తాడని తెలుస్తోంది. బ్రిటన్‌లో వివిధపార్టీల సంయుక్త మంత్రివర్గం అధికారంలో ఉన్నంత కాలం చర్చిల్ భారతదేశాన్నిగురించి ఎట్టినిర్ణయానికిరాక, టోరీపార్టీ హయాములో ఎందుకు చర్చిలు కొత్త ప్రతిపాదనలు పంపుతున్నాడు? భారతదేశంలో ప్రతిష్టంభన పరిష్కారానికి చర్చిల్ అడ్డు తగులుతున్నాడని, అలాంటి టోరీపార్టీ మనుష్యులకు వోటుచేయవద్దని, ఇంగ్లండులో లేబరుపార్టీ తీవ్రమైన ఆందోళన చేస్తోంది. దాన్ని సంతృప్తిపరచడానికి చర్చిల్ వేస్తున్న యెత్తు ఇదని అనుమానం కలుగడంలో ఆశ్చర్యంలేదు. కనుక రేపు వేవెల్ ప్రకటించబోయే "కొత్త ప్రతిపాదనల"లో కొత్తయేమీ ఉండదని, క్రిప్సు ప్రతిపాదనల లాగే ఉంటాయని, భాషలో మాత్రం కొత్త తనం ఉంటుందనీ గ్రహించవచ్చు.

ఈ ప్రతిపాదనల ఆధారంతో వైస్రాయి వివిధ పార్టీల నాయకుల్ని సమావేశపరచి, ఒక నిర్ణయానికి రమ్మనమని కోరవచ్చు. వర్కింగ్‌కమిటీ సభ్యుల్ని విడుదల చేస్తేనే గాని కాంగ్రెసు తరపున ఎలాంటి నిర్ణయం తీసుకోడానికి వీలులేదని గాంధీజీ తెలియజేయవచ్చు. వైస్రాయి నాయకుల్ని విడుదలచేసి, యుద్ధకాలపు పరిపాలనా విధానాన్ని గూర్చి గాంధీజీని సంతృప్తిపరచ గలిగితే, రాజీ సాధ్యం అవుతుంది. ఎందువల్లనంటే, కేంద్రప్రభుత్వం విషయంలో కాంగ్రెసుపార్టీ తరపున భులాభాయి దేశాయి, ముస్లింలీగ్ తరపున లియాఖత్ ఆలీఖాన్ కలిసి ఇదివరకే ఒక ఒడంబడికకు వచ్చారు.

అలా నాయకుల్ని విడుదలచేయకుండా, తన కొత్త ప్రతిపాదనలను కాంగ్రెసు అంగీకరిస్తేనే విడుదల చేస్తానని షరతుపెట్టినా, లేక నిజమైన అధికారం భారతీయులకు ఈయకపోయినా, ప్రతిష్టంభన అలాగే ఉండిపోతుంది. ఇంగ్లండులో టోరీపార్టీ నాయకులు తాము చేయగలిగినదంతా చేశామనీ, భారతీయులే రాజీకి రావడంలేదని, ఎన్నికల్లో ప్రచారం చేసుకుంటారు.

కాంగ్రెసువాదుల్లో చాలమంది గాంధీజీ షరతుల ప్రకారం రాజీ జరిగితే తప్పకుండా అట్టి రాజీకి అంగీకరించవచ్చునని భావిస్తున్నారు. అంతవరకూ ఒక్క అడుగు కిందికి దిగకుండా బిగించుకు కూచోవాలనికూడా అభిప్రాయపడుతున్నారు. కాని ఈ "బిగించుకు కూచోవడం" దేశాన్ని ఏగతికి తీసుకొచ్చిందో గ్రహించలేకున్నారు. దేశంలో నేడు కనపడే దృశ్యం ఏమిటి? నడిసముద్రంలో ఉన్న పడవకి తెరచాప తెగిపోయింది; పడవను నడిపేవారంతా ఒకరితో ఒకరు దెబ్బలాడుకొంటున్నారు. చుట్టూ ఆకలాది శవాలు, ఆకలిగొన్న ఆర్తనాదులు నీటిమీద తేలుతున్నారు. దూరాన్నుంచి దేశమాత బిగ్గరగా "ఏమి చేస్తున్నారు మీరు?" అని ప్రశ్నిస్తోంది! కాని, మనలో మనం ఒకరిపై ఒకరు ఎంత గట్టిగా కేకలు వేసుకొంటున్నామంటే, దేశమాత ప్రశ్న మనకు వినపడ్డమేలేదు.

నాయకులు విడుదల చేయబడితే, పార్లమెంటరీ కార్యక్రమాన్ని అమలుజరుపుతూ రాజీషరతుల నమలు జరుపమని గాంధీజీ బులాభాయిదేశాయివంటి శాసనసభానాయకులకు సలహా యిస్తాడని, మిగతావారికినిర్మాణ కార్యక్రమం అమలు జరుపమని సలహాయిస్తాడని, తెలుస్తోంది. నిజం చెప్పాలంటే, ఈ రెండు బృందాలమధ్య సమన్వయం, ఐక్యత తీసుకురాగలిగినవాడు గాంధీజీ ఒక్కడే. కాని అంతటితో సమస్యలన్నీ తీరిపోవు కాంగ్రెసు తరువాత రెండో ప్రధాన రాజకీయపార్టీయైన ముస్లింలీగుతో ఒడంబడిక చేసుకోవడం కూడా చాలా అవసరం. అంతే గాక, ప్రజలలో స్వతంత్రమైన పలుకుబడిగల కమ్యూనిస్టు పార్టీతో కూడా కాంగ్రెసు వాదులు కలిసి పనిచేసేలా చూడాలి.

ఒకవేళ వేవెల్ కాంగ్రెసు నాయకుల్ని విడుదల చేయకపోతే, రాజకీయప్రతిష్ఠంభన మామూలుగానే ఉండిపోతుంది. అప్పుడు జరిగేది ఏమిటి? గాంధీజీ ఇప్పటి మాదిరిగానే కాంగ్రెసువాదులందరికీ స్వేచ్ఛయిస్తాడు. ఎవరికితోచిన విధానాన్ని వారవలంబించ వచ్చునంటాడు. ఫలితం? ఏ గాంధీజీ వైపు దేశం ఎదురుచూస్తోందో, ఆ గాంధీజీ వివిధ దృక్పధాలుగల కాంగ్రెసువాదుల్ని ఏకతాటిమీద నడిపించలేకపోతాడు. ఎప్పటిమాదిరిగానే యికముందుకూడా ముందడుగువేసే అవకాశం ప్రభుత్వానికే ఉంటుంది.

"పీపుల్సువార్" నుండి

★

వలసదేశాలపై పెత్తనం పనికిరాదు

సోవియట్ పత్రికల విస్పష్ట ప్రకటన

సోవియట్ రెడార్మీ పత్రికయైన "రెడ్‌స్టార్" లో ప్రొఫెసర్ కొరోవిన్ యిలా రాస్తున్నాడు:

"వలసదేశాలపై నిరంకుశ పెత్తనం ఏ రూపంలో సాగుతున్నా, ఒక దేశంయొక్క భవిష్యత్తును నిర్ణయించే అధికారం మరొక ప్రభుత్వానికి ఉన్నంతకాలం వివిధ దేశాల మధ్య స్నేహభావమనేది అసంభవం. నిజమైన సమానత్వం, స్వయం నిర్ణయాధికారం, అప్పుడు ఉండవు. మానవుల హక్కులంటేగాని, ప్రాధమిక స్వాతంత్ర్య సూత్రాలంటేగాని, నిజమైన గౌరవం అప్పుడుండదు. ఈవిషయములో వాదనలు అవసరమా? కనుక, స్వాతంత్ర్యంకోరే దేశాలన్నీ యితర దేశాల స్వాతంత్ర్య వాంఛను గౌరవించవలసియుంది: ఇదివరకు కంటె ఇప్పుడు ఎక్కువ గౌరవించవలసియుంది. ప్రతిదేశంలోను ప్రజలు తమ ఆర్థిక రాజకీయ, మానసికాభివృద్ధికి యేమేమి చర్యలు అవసరమని భావిస్తారో, వాటికి పూర్తి అవకాశ మీయాలి. ఎవరూ వారిని అడ్డుపెట్టడానికి వీలులేదు.

"స్వాతంత్ర్యం కోరే వివిధ దేశాలు ప్రపంచ శాంతిని సుస్థిరం చేయడానికొక సంస్థను నిర్మించబోతున్నారు. అయితే, వలసదేశాల ప్రజలువేగంగా తమ జాతీయవాంఛను ఈడేర్చుకోవడంలో అన్ని అవకాశాలు యివ్వనంతకాలం ఆయా దేశాల పని పూర్తికానేరదు."

★

మొన్న 8 వ తేదీని "ప్రవ్దా" పత్రికలో మరొక వ్యాసం ప్రకటించ బడింది. అందులో యిలా ఉంది:

"వలసదేశాలపట్ల, పరాధీన దేశాలపట్ల, సోవియట్ ఎంతో స్పష్టమైన వైఖరిని కలిగియుంది. సోవియట్ ప్రభుత్వంయొక్క ప్రధానసూత్రం ఏమంటే, ప్రతిదేశానికి స్వపరిపాలనాధికారం, సంపూర్ణ స్వాతంత్ర్యం ఉండాలి పెద్దదేశమైనా, చిన్న దేశమైనా, ప్రజలకు స్వాతంత్ర్య హక్కు, సమానహోదా, ఉండితీరాలి. దాన్ని యితరులు గౌరవించాలి. లెనిన్, స్టాలిన్‌ల నాయకత్వంకింద సోవియట్ ప్రభుత్వం యీ ప్రధాన సూత్రాన్ని స్వీకరించింది."

★ సంపాదకీయం

పత్రికా స్వాతంత్ర్యం

సంయుక్త రాష్ట్రప్రభుత్వం 'పీపుల్సువార్', 'కౌమీ జంగ్', 'లోకయుద్ధ' పత్రికలను నిషేధించింది. ఇవి భారత కమ్యూనిస్టుపార్టీచే బొంబాయి నుంచి నిర్వహించబడుతున్న పత్రికలు. వీటిలో చంద్రసింగ్ గార్వాలీ జీవితానుభవాలను గురించిన వ్యాసం ప్రకటించినందుకు యు. పి. ప్రభుత్వం యీ నిషేధపుటాజ్ఞ జారీచేసింది. పైమూడు పత్రికలను సంయుక్త రాష్ట్రంలో అమ్మరాదని, పంచరాదని నిషేధించింది.

చంద్రసింగ్ వ్యాసం 1930 నాటి పెషావరు ఘటనలను గురించి చెబుతూంది. అపుడు గార్వాలీ సైనికులు నిరాయుధులైన పఠాను సత్యాగ్రహులపై కాల్చ నిరాకరించారు. హిందూసైనికులు ముస్లిం ప్రజలయెడ సోదరత్వాన్ని ప్రకటించిన చరిత్రాత్మక దృశ్యమది. హిందూ - ముస్లిం ఐకమత్యంయొక్క అవసరాన్ని నిరూపించిన ఘట్టమది.

చరిత్రను తెలిపే ఆ వ్యాసంలో నిషేధింపదగినదేమీలేదు. ఆ వ్యాసంలోనే చంద్రసింగ్ జపాన్‌దుండగీడులను ఎదిరించాలసిన అవసరాన్ని నొక్కిచెప్పాడు. జపాన్ వ్యతిరేక యుద్ధంలో పాల్గొనడానికి తన సంసిద్ధతను తెలిపాడు. తన మాతృభూమి అయిన గార్వాలీజిల్లాకు వెళ్లనిస్తే (ఇపుడు ఎక్సటర్న్మెంటు ఆర్డరువుంది) గార్వాలీ యువకుల్ని జపాన్ వ్యతిరేక యుద్ధంకొరకు రిక్రూటు చేస్తానని తన సంసిద్ధతను తెలిపాడు.

ఇలాంటి వ్యాసం ప్రకటించినందుకు పత్రికలపై ప్రభుత్వం ఇండియా డిఫెన్సు రూలును ప్రయోగించడంలో అర్థంలేదు. చంద్రసింగ్ వ్యాసం ప్రజలంతా ఐక్యమయి జపాను దుండగీడులను ఎదిరించమని ఉత్సాహమిస్తోంది. అందుకు పత్రికలను నిషేధించడం డిఫెన్సు చట్టాన్ని దుర్వినియోగపరచడమే అవుతుంది. ఈ పొరపాటును యిప్పటికైనా గుర్తించి సంయుక్తరాష్ట్రప్రభుత్వం 'పీపుల్సువార్' వగైరాలపై నిషేధాన్ని వెంటనే తొలగించాలి.

ఈ నిషేధం నిజంగా పత్రికా స్వాతంత్ర్యంపై దాడివంటిది. అందుచే సోదర పత్రికలన్నీ సంయుక్త రాష్ట్రప్రభుత్వ చర్యను నిరసించాలి. దేశభక్తులందరూ పౌరసత్వ హక్కులపై గావింపబడిన యీదాడిని ఎదిరించాలి. పార్టీవిభేదాలుమరచి ప్రభుత్వచర్యను ఖండించాలి.

పురుషోత్తమదాస్ టాండన్, గాడ్గిల్, బ్రెల్వీ లాంటి కాంగ్రెసు ప్రముఖులు, బాంబే క్రానికల్, బాంబేసెంటినల్, సంధ్యాకాల్, విశ్వామిత్ర, ఆజ్మల్, ముస్లిం, ఇంక్విలాబ్ మొదలైన జాతీయపత్రికలు పై నిషేధాజ్ఞను తీవ్రంగా విమర్శించాయి. సోదరాంధ్ర పత్రికలు, ఆంధ్ర కాంగ్రెసు, లీగు నాయకులు అదే విధంగా చేస్తారని ఆశించుతాము.

కంచుకాగడా

జూన్ 1 వ తేదీనుంచి రాష్ట్ర కాంగ్రెసు అసెంబ్లీ పెత్తందార్లు కృష్ణాజిల్లాలో సంచారం చేశారు. చంద్రమౌళి, సంజీవరెడ్డి, బాపినీడు, బ్రహ్మయ్యగార్లు వగైరా సంచారంలో పాల్గొన్నారు. అయ్యదేవరవారు కూడ మొదట కొన్ని సభలకు విచ్చేశారు. కాశేశ్వరరావుగారి ఉపన్యాసాలలో కొన్ని మచ్చుతునకలు....

జూన్ 1 వ తేదీ కంకిపాడుసభలో కాశేశ్వరరావుగారు ఇలా చిత్తగించారు: "కామ్రేడులు రష్యా ప్రొద్దుతిరుగుడుపువ్వులు. రష్యా ఎటు తిరిగితే అటుతిరుగుతాయి, ఈపువ్వులు. మేము రష్యాగాని, జర్మనీ, జపాన్‌గాని అమెరికా ఇంగ్లాండుగాని ప్రొద్దుతిరుగుడు పువ్వులముకాము. ఆంగ్లో ఇండియన్సుగాని యూసో యిండియన్సుగాని కాము. మేము ఇండియన్సము. యాంటీ ఫాసిస్టులము ! యాంటీ కాపిటలిస్టులము ! యాంటీ కమ్యూనిస్టులము. గాంధీవాదులము ! సత్య అహింసావాదులము !! వారు, రష్యాలోవలె ఇక్కడకూడ సంస్కృతి, విజ్ఞానం, పరిపాలనావిధానం కావాలంటున్నారు. స్టాలిన్ కావాలంటున్నారు. మీకు స్టాలిన్ కావాలా ? గాంధీకావాలా ? రష్యాలో ప్రజా ప్రభుత్వంలేదు. కార్మిక - మిలిటరీప్రభుత్వం వుంది. ఆర్థికసమానత్వం లేదు. హెచ్చుతగ్గులున్నాయి. అనేక లక్షల మంది విద్యాధికులను ఉరితీశారు రైతుల భూములను లాక్కున్నారు. పౌరసత్వ హక్కులు లేవు. వేరొక రాజకీయపార్టీలేదు. మేము అట్టి నిరంకుశపరిపాలనా విధానము వలదంటున్నాము. బ్రిటన్ అమెరికాలలోవంటి డెమాక్రసీ కావాలంటున్నాము"

అయ్యదేవరవారి ధోరణి యీ విధంగా నడిచింది. కమ్యూనిస్టులు రష్యావైపుచూస్తారనే నిందతో వీరు బయలు దేరారు. చివరకు తనకు 'బ్రిటను - అమెరికాలోవంటి డెమాక్రసీ' కావాలంటున్నామని తేలారు. అంటే ప్రజా ప్రభుత్వమైన సోవియట్‌ను నిరసించుటతో బయలుదేరి, బ్రిటిషు సామ్రాజ్యవాదుల పరిపాలనా విధానాన్ని మెచ్చుకోడంలోకి దిగజారారు. ఈయనదృష్టిలో రష్యాలోనిది నిరంకుశ ప్రభుత్వం ! బ్రిటిషు సామ్రాజ్యవాదుల ప్రభుత్వం డిమాక్రసీ ! ఏమిఖర్మం !

మన భారత దేశాన్ని బానిసత్వంలో ఉంచిన బ్రిటిషు సామ్రాజ్యవాదుల నాయకుడు చర్చిల్ కూడా ఎన్నికల ఉపన్యాసంలో సోషలిజాన్ని క్రింది విధంగా ఆక్షేపించాడు:

"వ్యక్తి స్వాతంత్ర్యానికి పుట్టినిల్లు బ్రిటన్. సామ్యవాదపద్ధతి ఈస్వాతంత్ర్యాన్ని హరించివేస్తుంది. ఆస్తులను కైవశం చేసుకోవడమే కాదు మానవుని సకల ప్రవృత్తులనూ ప్రభుత్వమే శాసింప బూనుకుంటుంది నోరు మెదపడానికి వీలుండదు. స్వేచ్ఛగా ఊపిరి పీల్చుకోనివ్వరు. సోషలిస్టుప్రభుత్వం అనడంతోటే, ఏదో ఒక విధమైన 'గెస్టాపో (గూఢచారి) వర్గ ప్రాబల్యం తప్పదు."

చూడండి ! విచిత్రం !! చర్చిల్‌నిందలు, కాశేశ్వరరావు సుభాషితాలు ఒకే పంథాలో నడుస్తున్నాయి. చర్చిల్ సోషలిజాన్ని నిందిస్తున్నాడు. కాశేశ్వరరావూ అంతే. అతగాడు బ్రిటనులో వ్యక్తిస్వాతంత్ర్యంవుందని కోతలు కోస్తున్నాడు. ఇతగాడు బ్రిటిషు డిమాక్రసీ వంటిది తనకు కావాలని లొట్టలువేస్తున్నాడు.

ఈమాటల లొల్లితనాన్ని గురించి నేను వాదించ నక్కరలేదు. చర్చిల్ డాబును బట్టబయలు చేస్తూ ఒక జాతీయపత్రికవ్రాసిన మాటలను ఉదహరించుతాను. జూన్ 9వ తేదీ సంపాదకీయంలో "కృష్ణా పత్రిక" చర్చిల్‌వాదనను యిలా ఖండించింది :

"ధనికవర్గాలు ఇష్టము వచ్చినట్లు లాభాలను కొల్లగొట్టడానికి ఉపయోగపడుతోంది నేడు బ్రిటనులో వ్యక్తిస్వాతంత్ర్యం. సామ్రాజ్యంలో వున్న అస్వతంత్ర దేశాలసంగతి ఇక చెప్పనే అక్కరలేదు కదా ! వ్యక్తి స్వాతంత్ర్యం అక్కడ మృగ్యం........ఈ లొల్లినంతా కప్పిపుచ్చి, వ్యక్తి స్వాతంత్ర్య రక్షణకు తాను దిగివచ్చినట్లు మాట్లాడాడు చర్చిలు ప్రధాని."

అని "కృష్ణా పత్రిక" ఆక్షేపించింది. కాశేశ్వరరావుగారి వ్యామోహానికి కూడా సమాధానమిదే. ఇంక కాశేశ్వరరావుగారు సోవియట్‌లో నిరంకుశత్వముందని శుద్ధ అబద్ధాలు వల్లించాడు. తనకు సాక్ష్యంగా మసానీ, విల్కీ, వెబ్స్ పుస్తకాలను ఉదహరించాడు. మసానీ కాశేశ్వరరావు జాతికి చెందినవాడే. విల్కీ, వెబ్స్ పుస్తకాలలో ఆవిధంగా చెప్పలేదు. వెబ్స్ దంపతులు వ్రాసిన "సోవియట్ కమ్యూనిజం" అనే పుస్తకంలో సోవియట్ రాజ్యాంగం నూతన విధమైన ప్రజాస్వామికమని స్పష్టపరచారు. చూచారా ! కాశేశ్వరరావు వక్రభాష్యాలు ఎలా వుంటాయో !!

ఇలాంటి అబద్ధాలు చెపుతూ కాశేశ్వరరావు ఇంకేమంటున్నాడో చూడండి ! "పీపుల్సు బుక్‌డిపో" ప్రచురణలు నమ్మకండి ! "ప్రజాశక్తి" వ్రాసినది నమ్మకండి ! మాలటోవ్ చెప్పినదానికి, అమెరీ - చర్చిల్ చెప్పిదానికి, భేదమేమీలేదు" అని సెలవిచ్చాడు. ఔరా ! ప్రబుద్ధుడా !!

తరువాత కమ్యూనిస్టు స్త్రీలను నిందించడానికి పూనుకున్నాడు. "తెలంగానా" పత్రికలో ఒకస్త్రీ తనమంగళసూత్రాన్ని పార్టీకిచ్చినట్లు వున్నది. ఈ విధంగా మంగళసూత్రములు త్రెంచుట భర్తలమైనమనము బ్రతికియుండగనేనా ? ఇది మీరు సహిస్తారా ?" అని కాశేశ్వరరావుగారు కేకలువేస్తున్నారు. కొంపదీసి ఈ అఖిలాంధ్ర భర్తల కాంగ్రెసు అసెంబ్లీ స్థాపించడు కదా !

ఈ మాటలలో రాజకీయ విమర్శనలేదు. నిండా ఉక్రోషం వుంది ఆమాటలు ఆయన ఎంతనీచానికి దిగాడో మాత్రం తెలుపుతాయి. అందుచే ప్రతిమాటకు సమాధానం అనవసరం. 1929 లో చరఖా సంఘనిధికి, 1934 లో హరిజననిధికి వసూళ్ళుచేస్తూ గాంధీజీ ఆంధ్రదేశంలో సంచారం చేశాడు. అనేకచోట్ల తమ నగలను యిచ్చారు. పుస్తెలు యిచ్చిన తల్లులుకూడ వున్నారు. కాశేశ్వరరావు ద్వేషమనే ఊబిలో మునిగిపోతూ కాంగ్రెసు చరిత్రనే మరచిపోతున్నాడు.

ఐనా ఈవిషయంలో కాశేశ్వరరావుగారు తమ శిష్యులైనగోపరాజురామచంద్రరావు, తుమ్మల గోపాలకృష్ణయ్యగార్ల (మంగళసూత్రాలని మంటగలపాలనే ఉద్యమంతెచ్చిన ప్రబుద్ధులు) నుంచి మంగళసూత్రాల విషయమై సలహాలు పుచ్చుకోవడం మంచిది !

కమ్యూనిస్టులు కాంగ్రెసులో ఉండరాదని చెబుతూ "ఇదేమన్నా సర్కస్‌హాలా, కోతులు, ఏనుగులు ఉండుటకు ? క్రమశిక్షణ వలదా ? లేక మమ్ములనుకూడా కామ్రేడులు అవమన్నారా ? పైగా కమ్యూనిస్టులు బొంబే ప్లానును అంగీకరించారు. అందువల్ల అమెరికా సరుకులు మనదేశంలో దిగుతాయి. అమెరికా ఫేస్‌పౌడర్ ఎరుకుల గుడిసెలోకి వస్తుంది. ఎరుకలయువతి కామ్రేడై, దాన్ని చేస్తుందన్నమాట"అన్నాడు కాశేశ్వరరావు.

పరిశ్రమలు కావాలంటే ఫేస్‌పౌడర్లు వస్తాయని కాశేశ్వరరావుగారు వెక్కిరించడం వింతగా వుంది. ఇపుడుమనకు యంత్రపరిశ్రమలు లేవు. అయినా కాశేశ్వరరావుగారి రక్షణలోవున్న అమ్మాయిలు సైతం నేడు ఫేస్‌పౌడర్ వాడుతున్నారు. బొంబేప్లానువస్తే అమెరికాఫేస్‌పౌడరు దిగుమతి అయి ఎరుకలయువతిదాన్నిచేయడమేమిటి ? ఈ వాదన "ముడ్డిమీద తన్నితే మూతిపళ్ళు రాలుతాయి" అన్నట్లుంది. ఐనా కాశేశ్వరరావుగారు ఆ విషయమై తమ మిత్రులైన బిర్లా-టాటా బ్రదర్స్‌కు సలహాయివ్వడం మంచిది !

సుందరయ్యగారి విడుదల

★

కామ్రేడ్ సుందరయ్యను జామీనుపై విడుదలచేయమని బందరు సబ్‌డివిజనల్ మేజిస్ట్రేటుగారికి 29—5—45 వ తేదీన పిటీషను దాఖలుచేయబడిందని, దాన్ని విచారణ చేయడానికి 8-6-45 వ తేదీకి వాయిదా వేయబడిందని, యిదివరలో వ్రాశాం.

8-6-45 వ తేదీ ఉదయం 11 గంటలకు సుందరయ్యగారిని సబ్‌జైలునుండి సబ్‌డివిజనల్ మేజిస్ట్రేటుకోర్టుకు బేడీలువేసి పోలీసులు తీసుకువచ్చారు. రాజకీయ ఖైదీలకు బేడీలువేయడం అగౌరవమైన విషయం అని పోట్లాడిన తదుపరి మేజిస్ట్రేటు ఆర్డరుపై బేడీలు తీసివేయబడ్డాయి.

మేజిస్ట్రేటుగారు సాయంకాలం 3 గంటలకు కోర్టుకురాగానే సుందరయ్యగారి జామీను పిటీషనుగూర్చి విచారణ చేయమని సుందరయ్యగారి తరపున వాదించడానికి బొంబాయి నుండి వచ్చిన శ్రీయుత ఎ. యస్. ఆర్. చారిగారు (బొంబాయి హైకోర్టు అడ్వకేటు) మేజిస్ట్రేటుగారిని కోరారు. కాని మేజిస్ట్రేటుగారు ఆ రోజున జామీను పిటీషను విచారణ చేయడానికి అంగీకరించకుండా 11-6-45 వ తేదీకి వాయిదావేస్తున్నానని చెప్పారు. తమ ముందు జామీనుపిటీషను ఫైలులేదని, దాన్ని పామర్రు పోలీసు సబ్‌ఇన్‌స్పెక్టరుగారికి పంపామని, అందుచేత ఆరోజున విచారణ చేయడం సాధ్యంగాదని తెల్పుతూ విచారణ వాయిదా వేస్తున్నామని చెప్పారు.

దానిపైఅడ్వకేటు చారిగారు అలావాయిదా వేయడం యేమాత్రం సమంజసంగాదనీ, మేజిస్ట్రేటుగారుతెల్పిన కారణం సహేతుకంగాలేదనీ, వాదించారు. వారింకా ఇలా అన్నారు : "కమ్యూనిస్టుపార్టీ నాయకుణ్ణి 23 రోజులు నుంచి పోలీసులు కక్ష తీర్చుకోవడానికిగాను కుక్కలు గూడ నివశించడానికి యోగ్యముగాని జైలుగదిలోవుంచి, బాధిస్తున్నప్పుడు, గౌరవనీయులైన కోర్టువారు జామీను పిటీషనను ఒకగంటసేపు వాయిదా వేసినా అది అనుచితమని నా అభిప్రాయం. పామర్రు పోలీసు సబ్‌ఇన్‌స్పెక్టరు ఈకేసులో ఒక సాక్షిగా వున్నారు. కేసు నిర్వహణలో ప్రధానపాత్ర వహించుతున్నారు. అలాంటి ఆయన కేసు వాయిదాకి రాకుండా బెయిల్ పిటీషనుయావత్తూ తనవద్ద వుంచుకుని మేజిస్ట్రేటు ఉత్తరువును ధిక్కరించి, కోర్టుకు హాజరుకాకుండా, తన వకీలుకుగూడ కబురు పంపక నిర్లక్ష్యం చేయడం గర్హ్యనీయమైన విషయం. పైకారణాలవల్ల జామీనుపిటీషను విచారణను ఒక గంటైనా వాయిదా వేయరాదని నేను అభ్యంతర పెట్టుచున్నాను."

అడ్వకేటు చారిగారి అభ్యంతరాన్ని మేజిస్ట్రేటు గారు రికార్డు చేస్తూ, విచారణ మాత్రం 11-6-45వ తేదీకి వాయిదావేశారు.

ఈ ఆర్డరు పై కృష్ణా జిల్లా సెషన్సు సెషన్సు జడ్జిగారి వద్ద సుందరయ్యగారి తరపున వి. వి. శాస్త్రుగారు, వకీలు ఉమ్మెత్తుల రామారావుగారు 8-6-45 వ తేదీన అప్పీలు దాఖలు చేశారు. దానిపై సెషన్సు జడ్జిగారు 11-6-45న తేదీన తప్పకుండా జామీను పిటీషనుగూర్చి విచారణజరిపి ఆర్డరుస్యాసుచేయవలసినదిగా సబ్‌డివిజనల్ మేజిస్ట్రేటుగారికి ఇన్‌స్ట్రక్షన్సు పంపినట్లు తెలుస్తుంది.

11—5—45 న కామ్రేడ్ సుందరయ్యగారిని జామీనుపై విడుదల చేశారు. 150 మంది విద్యార్థులు, తదితరులు సుందరయ్యగారికి బెజవాడ స్టేషనులో అఖండ స్వాగతమిచ్చారు.

కామ్రేడ్ సుందరయ్యగారిని వెంటనే విడుదల చేయవలసిందని ప్రభుత్వాన్ని కోరుతూ యీ క్రింది సభలలో తీర్మానాలు ఏకగ్రీవంగా ఆమోదింపబడ్డాయి.

చీపురుపల్లి (ఉత్తరవిశాఖ), చింతలపూడి (వ. గోదావరి), విజయనగరం, రామాపురం, కప్పలదొడ్డి, అచ్చమ్మపేట.

ఆంధ్రా సిమెంటు ఫాక్టరీ యజమానుల పక్షపాతం

1944-45 సంవత్సరంలో ఆంధ్రసిమెంటు ఫాక్టరీకి రు. 3 లక్షలకుపైగా లాభంవచ్చిందని తెలుస్తోంది. ఇటీవలనే ఫాక్టరీ మేనేజర్లు - ఇంజనీర్లు, సూపర్‌వైజర్లుమొదలగు పైఉద్యోగులు రు. 20 లు మొదలు రు. 50 ల వరకు జీతాల ప్రమోషన్లు పొందారు. ఈ కరువు కాలంలో పై వుద్యోగులకైనా జీతాలు పెంచడం న్యాయమే. కాని సంవత్సరమంతా కరువుబాధకు గురిఅవుతూ, రెక్కలువిరుచుకు పనిచేసే 300 మంది కార్మికుల నోట్లో కరక్కాయ కొట్టారు. 2 మాసాలు గడచినా, యిప్పటివరకుకరువుభత్యంఇవ్వనేలేదు. కార్మికుల్లో తీవ్రమైన అసంతృప్తిఏర్పడింది. యజమానులపక్షపాతాన్ని కార్మికులు బట్టబయలు చేస్తూ ప్రభుత్వానికి కూడా తెలియపర్చారు. యీకార్మికులంతానేషనల్ టెక్నికల్ పర్సనల్ ఆర్డినెన్సు క్రిందకువస్తారని ప్రకటించిన ప్రభుత్వం వీరి జీతాలు యితర యిబ్బందుల విషయంలో కూడా కలుగజేసుకోవాలి.

చిన్నకథ

పార్టీఫండు రసీదు

●

సి. వి. కె. రావు

ఒకనాటి సాయంత్రం. మాఊరు పుస్తకశాలకు వెళ్ళి కూర్చున్నా. అదిమెయిన్‌రోడ్డు. "పీపుల్సు బుక్‌డిపో"వైపు చూడనివారుండరు. దానిపైన ఎగిరే ఎర్రజెండావల్ల ఆకర్షించబడనివారుండరు. అఊళ్లో ఎర్రజెండాను చూచినపుడు పేదప్రజల ముఖాలపై ఉత్సాహం, ధైర్యం, సంతోషం, చిందులుతొక్కుతాయి. ఎన్నోసార్లుఆజెండాకింద ప్రజలుతమహక్కులకైపోరాటాలు సాగించారు. ఎన్నోవిజయాలు పొందారు. ప్రజాసమస్యలెన్నో పరిష్కరించుకున్నారు. జెండా చూచినప్పుడివన్నీ వారికి జ్ఞాపకమొస్తాయి. ఈ ఎర్రజెండాయే నేడు బెర్లిన్ నగరంపై ఎగురుతోందని వారుగ్రహించారు. దాన్ని చూచినప్పుడు వారి ముఖాల్లో కనబడేగర్వం నాకెంతో ఆనందంకలిగిస్తుంది.

మెయిన్‌రోడ్డు కనుక, అన్ని తరగతుల ప్రజలు నడుస్తుంటారు. వచ్చేపోయే విద్యార్థులు, వర్తకులు, ఉద్యోగులు - అందరూ బుక్‌స్టాలులో కూర్చుంటే కనపడతారు. కొందరు నన్ను దూరంనుంచి పలకరించి వెళ్ళిపోతారు. కొందరు లోపలికివచ్చి, ఇండియానుగురించో, రష్యా, బ్రిటన్‌ని, గురించో, లేక పోలెండును గురించో, చర్చించి వెళుతూ ఉంటారు. అంతకు ముందు రాజకీయాలంటే అంటనివారుకూడా యింత శ్రద్ధవహించడం చూస్తే, నాకెంతో ఉత్సాహంగాఉంటుంది. నేడురాజకీయాలు ప్రజలకెంతదగ్గరయ్యాయో స్పష్టమవుతుంది. అనుమానాలు తీరినా తీరకపోయినా, వచ్చినవారికి బుక్‌స్టాల్ కామ్రేడ్ ఆసమస్యపై చిన్నపుస్తకాలు ఎన్నో అందిస్తాడు; కొనిపిస్తాడుకూడాను.

లారీలు, కారులు, ఎన్నో ఆ మెయిన్ రోడ్డున పోతుంటాయి. కారుల్లోపోయే తెల్ల సైనికులు కొంతమంది ఎర్రజెండాను చూచినపుడు సెల్యూటు చేస్తారు. మేం కూడ తిరిగి ఆ కామ్రేడ్సుకు సెల్యూట్ చేస్తాము. రోడ్డు మీద చాలమంది యింగ్లీషు సైనికులు నడుస్తుంటారు. జెండా చూచి, కొంతమంది లోపలికి వస్తారు.

ఆ సాయంత్రం ఒక ఆంగ్లేయ యువకుడు వచ్చాడు. 25 సంవత్సరాలుంటాయి. ఎంతో స్నేహపూర్వకంగా "గుడ్ ఈవినింగ్ ! ఏమేమి పుస్తకాలు అమ్ముతున్నారు ?" అన్నాడు. ప్రశ్నకు కృతజ్ఞత తెలుపుతూ, "కార్చో" మని, కామ్రేడ్ పుస్తకాలు తీసి ఒక్కొక్కటే బల్లమీద పెట్టాడు. సైనికుడు తనకు కావలసిన పుస్తకాలు తీసుకున్నాడు. "పీపుల్సువార్" కొన్నాడు. "జాన్‌సన్ అనే ఆంగ్లేయ సైనికుడు బర్మారంగంలో ఫాసిస్టుల చేతుల్లో చనిపోయాడు. చనిపోయేముందు తన భార్యకువ్రాసిన జాబులపుస్తకం చదివారా ?" అని అడిగాడు బుక్‌స్టాల్ కామ్రేడ్.

"చదివాను. జాన్‌సన్ ఒక ఆదర్శమైన ఆంగ్లేయ యువకుడు. మీ దేశస్తులకు బ్రిటిష్ స్వాతంత్ర్యపోరులసానుభూతి ఎంతగా ఉందో చూపించాడు." అన్నాడు.

"అతనితోకలసి నేను పనిచేశాను. ఎంతో ఓపికతో, ఎంతమందికైనా దేశపరిస్థితులగురించి బోధించేవాడు. చక్కని భావాలు అందరిలోను కలిగించేవాడు. అటువంటి మిత్రుడు చనిపోవడం తలచుకొన్నప్పుడల్లా నా కెంతో విచారం కలుగుతుంది. జాన్‌సన్ నిజమైన ఆర్టిస్టు. మీ దేశంలో తాను చూచిన ప్రజల కష్టాలు పుస్తకంలో చిత్రించాడు. భారత ప్రజల స్వాతంత్ర్య సాధనకు బ్రిటిష్ పౌరుల సహాయంకూడా అవసరమని బోధించాడు."

"జాన్‌సన్ ఉత్తరాలు కొన్ని "పీపుల్సు వార్" పత్రికలో అచ్చువేయించి దేశభక్తులందరికి అందచేశాం. మా తెలుగుభాషలో కూడ "ప్రజాశక్తి"లో తర్జుమాచేశాం. ఈ యింగ్లీషు దేశభక్తుడిని మా ప్రజలకు పరిచయం చేశాము" అని అన్నాను.

ఆంగ్లేయమిత్రుని ఆనందం ఇంతా అంతా కాదు. "జాన్‌సన్‌కి శిష్యులు చాలమంది ఉన్నారు. నేను కూడా ఆయన శిష్యుణ్ణే!" అన్నాడు.

"మీరంతా రాబోయే బ్రిటన్‌యొక్క భవిష్యత్తును నిర్ణయిస్తారు. సోషలిస్టు బ్రిటన్‌కి పునాదులేస్తారు. బ్రిటన్‌లో ప్రజాసామాన్యం బ్లింపుల (సామ్రాజ్యవాదుల) అధికారానికి ఎప్పుడు స్వస్తిచెబుతారా అని ఎదురుచూస్తున్నాం. మీఅందరి భవిష్యత్తు దాంట్లో యిమిడివుంటుంది. అమెరీని ద్వేషించని భారతీయుడు మాదేశంలో లేడు," అన్నాను.

"నాకుతెలుసు. బెంగాలు కరువులో అనేక ఘోరదృశ్యాలు నేను కళ్ళారచూచాను. కలకత్తా వీధుల్లో మానవులు తిండిలేక, దిక్కులేక చచ్చిపోయి పడివుంటే, మా హృదయాలు తరుక్కుపోయాయి. అటువంటి శవమే ఒకటి లండను రోడ్డుమీద పడిఉంటే ఎంత టోరీ ప్రభుత్వమైనా 24 గంటలకంటే ఎక్కువ అధికారంలో ఉండేదికాదు." అన్నాడతను.

"మీరు కండ్లారచూచిన మాదేశపరిస్థితులు మీప్రజలందరికి తెలియజేయాలి."

"అది మావిధి. జాన్‌సన్ శిష్యులమైన మేము బ్రిటన్ చేరుకున్నతోడనే నిర్ణించము. ఎంతోమంది భారతీయ యువక సైనికులతో కలసి మేం ఫాసిస్టు విరోధులను ఎదుర్కొంటున్నాం ఇండియనీ, బ్రిటిష్ అనే తేడాలు లేకుండా సోదరులవలె కష్టాలు భరిస్తున్నాము కదా ! మీదేశంలో మేము పని చేస్తున్నాము అంటే, ఉద్యోగులవలె క్లబ్బు జీవితాలుకావు మావి. మేము ప్రజలనుండి వచ్చాము. భారత సైనికులతోపాటు పొలాల్లోను, కొండల్లోను, సముద్రంమీద పనిచేస్తున్నాం. నూతన ప్రపంచం కొరకు మనం చేసే కృషి ఎట్లా మరచిపోతాం ?"

"మొన్న ఒక ఆంగ్లేయ ఆఫీసరు మా బుక్‌స్టాలుకువచ్చాడు. "నవలలు ఉన్నాయా" అని అడిగాడు. చైనా, ఇండియా, రష్యా రాజకీయాలపై పుస్తకాలుచూచాడు. "అమ్మో యివి అన్నీ High brow Stuff! (పెద్ద తరహా పుస్తకాలు) "అని అరచి కారులోకి ఒక్క దుముకు వేశాడు."

"బ్లింపుల విజ్ఞానమంతే ! ఛాంబర్లేనులు, చర్చిలులు అమెరీల చేతుల్లో వాళ్ళుకూకులు సురక్షితంగా ఉంటాయను కుంటున్నారు. 1937 కాదు యిది ! 1945 అని జ్ఞాపకం తెచ్చు కొంటాడు"

"చర్చిలు హోయాము ఇక అఖరేనా !" అని అడిగాను.

"టోరీ గ్రూపులో అతనొక తీవ్రమైన ఫాసిస్టు వ్యతిరేకి కాబట్టి బ్రిటను ఉన్నక్లిష్టపరిస్థితుల్లో అతని నాయకత్వానికి అన్ని పార్టీలు అంగీకరించాయి. కాని హిట్లరు పతనంతో అతని పనిపూర్తిఅయింది. ఇక చర్చిలు అవసరం మాకు లేదు. ఇప్పుడు అతన్ని బలపరచేవారల్లా అభివృద్ధి నిరోధక సామ్రాజ్యవాదుల్ని బలపరిచేవారే"

"గొప్పఎత్తు ఎత్తాడు. చర్చిల్ ఏదోవిధంగా తన పలుకుబడిని ఉపయోగించి, మీబోటి స్వాతంత్ర్య ప్రియులు దూరంగా యుద్ధభూముల్లో ఉండడంచూచి, ఎలక్షనులన్నాడు."

"మేం ఎంత దూరంగా ఉన్నప్పటికీ, మా దేశాన్ని గురించి మేం ఆలోచిస్తూనే ఉన్నాం. చర్చిల కంటె ముందే మేం నిర్ణయించుకొన్నాం. లేబరుపార్టీ, కమ్యూనిస్టుపార్టీ, అభివృద్ధి శక్తులన్నీకలసి టోరీలకు స్వస్తి చెప్పదలచుకొన్నాం. మేమంతా యీ స్వాతంత్ర్య యుద్ధంలో త్యాగంచేసింది టోరీలకు తిరిగి అధికారం ఒప్పచెప్పడానికి కాదు. హిట్లరునుఓడించామంటే, ప్రజల కెంత బలం వచ్చిందో ప్రతివ్యక్తికీ తెలుసు."

"లేబరు అధికారంలోకివస్తే, బెవిన్ ఇండియా ఆఫీసుయొక్క బోర్డు మాత్రం మారుస్తానంటాడు. యిది భారత ప్రజల్ని ఏమాత్రం సంతృప్తి పరచదు."

"మీకు తెలియందేముంది ? బెవిన్‌కాదు భారత ప్రజల స్వాతంత్ర్యాన్ని నిర్ణయించేది. మేము బ్రిటిష్ కార్మికుల బిడ్డలము. భారతదేశ స్వాతంత్ర్యాన్ని కాంక్షిస్తున్నాం. మా యూనియను నిర్ణయాన్ని బెవిన్ అచరణలో పెట్టాలి. బ్లాక్‌పూల్ సమావేశంలో బ్రిటిషు కార్మిక ప్రతినిధులు తమ నాయకుల్ని సరియైన దారిలో పెట్టే స్థితిలోనే ఉన్నారు."

ఇంతలో కామ్రేడ్—వచ్చాడు. సైకిలుదిగి, "సెల్యూట్, కామ్రేడ్ !" అని లోపలికి వచ్చాడు. "సెల్యూట్ !" అన్నాను. ఏదో చెప్పబోయి, మాట్లాడు కుంటున్నామని ఆగాడు. ఆంగ్లేయ మిత్రుడు యీ కొత్త ముఖంవైపు చూచాడు.

"ఇతను ఒక కార్మికబిడ్డ. చాలా కార్మిక పోరాటాల్లో ఆరితేరాడు. జైల్లో బంధింపబడ్డాడు. సంఘాలు నిర్మించడంలో మంచి నేర్పరి. పార్టీ సందేశాన్ని ప్రజల్లో చక్కగా బోధపరుస్తాడు." అని చెప్పి, పరిచయం చేశాను. బ్రిటిషు కామ్రేడ్ లేచి, కామ్రేడ్ చేయిపట్టుకొని "నేనుకూడ కార్మికబిడ్డనే!" అని కౌగలించు కున్నాడు.

ఈ దృశ్యం మమ్మందరిని పరవశుల్ని చేసింది. భారతకార్మికుని, బ్రిటిషు కార్మికుని ఐకమత్యం చాటింది. బ్రిటిషు కామ్రేడ్ పార్టీఫండుకింద రు. 60 యిచ్చి, "దీనిని మా మిత్రులంతా వసూలుచేసారు "మా డెయిలీ వర్కరు" ఫండుతోపాటు యిక్కడ పార్టీకి ఇంకా కొంత వసూలు చేస్తాం !" అన్నాడు.

రసీదువ్రాసి యిచ్చాం. రసీదువెనుక నినాదాలు చదవబోయాడు. కాని తెలుగుబాష ! "మాతృదేశ రక్షణకోసం, ఆహారసమస్యను పరిష్కరించడం కోసం, కాంగ్రెసు నాయకుల విడుదల కోసం, జాతీయ ప్రభుత్వస్థాపన కోసం, కమ్యూనిస్టుపార్టీకి సాయం చేయండి"అని వుంది. ఈ నినాదాలు తర్జుమాచేసి యింగ్లీషులో చెప్పాను. ఆంగ్లేయమిత్రుడు విని, ఉత్సాహభరితుడయ్యాడు. "మీ పార్టీ ఫండు రసీదు జాగ్రత్తగా మా దేశం తీసుకువెడతాను. దీన్ని స్నేహచిహ్నంగా దాచుకుంటాను. వెళ్ళి వస్తానుకామ్రేడ్ !"అనిబుక్‌స్టాలు దిగాడు.

ఆకామ్రేడ్‌ని సాగనపుంతూ, "మీదేశంలో బ్రిటిషు కార్మికులు నాకుకమ్యూనిజంనేర్పారు. నేడు ఆంధ్రపార్టీకి మాఊళ్లో ఒక బ్రిటిషు కామ్రేడ్ పరిచయం కలిగింది !" అని గర్వంతో పలికాను.

కృష్ణాపుష్కరాలు : యువకుల కర్తవ్యం

కృష్ణాజిల్లా యువజనసంఘ ప్రధానకార్యదర్శి తాతినేని సూర్యప్రకాశరావుగారిలా రాస్తున్నారు :

కృష్ణా పుష్కరాలు సమీపిస్తున్నాయి. జులై 17 నుండి ప్రారంభం. లోగడ శివరాత్రి ఉత్సవాలలోను, గ్రామాలలో అంటువ్యాధులు ప్రబలినప్పుడు, రైతుమహాసభల్లోనూ వలంటీర్లుగా పనిజేసి ప్రజా మన్ననలకు పాత్రులమయాం. పుష్కరములకు వేలకొలది ప్రజలు కొన్ని కేంద్రాలలో సమావేశమగుటవలన, అంటువ్యాధులు ప్రబలటం, అనేక ఇబ్బందులకు ప్రజలు గురికావడం జరుగుతుంది. వీటన్నిటినుండి ప్రజలను కాపాడుటకు ప్రజల బిడ్డలమయిన మనం తయారుగావాలి.

ఈక్రింది యాత్రాస్థలములలో ఇన్నివేల మంది వస్తారని అంచనా :

1.	ముత్యాల	2000
2.	వేదాద్రి	1000
3.	యిబ్రాం పట్నణం	2000
4.	ఎనమలకుదురు	3000
5.	తోట్లవల్లూరు	8000
6	ఐలూరు	3000
7.	శ్రీకాకుళం	2000
8.	పెదకళ్ళేపల్లి	5000

ముత్యాల కేంద్రానికి 30 మంది వలంటీర్లు, వేదాద్రికి 15మంది, యిబ్రాంపట్నానికి 30 మంది, యెనమలకుదురుకి 50 మంది, తోట్లవల్లూరుకి 90 మంది, ఐలూరుకి 35 మంది, శ్రీకాకుళానికి 30 మంది, పెదకళ్లేపల్లికి 75 గురు, అవసరం. బెజవాడపట్టణమునకు లక్షకుపైగా వస్తారని అంచనా.

పై అన్ని కేంద్రాలలోనూ, ముఖ్యంగా బెజవాడలో, మొత్తం వెయ్యి మంది వలంటీర్లను సమీకరించుటకు జిల్లా యువజనసంఘం నిశ్చయించింది. కాన జిల్లాలోని యువకులు, ముఖ్యంగా ప్రాథమిక సంఘాలు, యీ కార్యక్రమమును దృష్టిలో వుంచుకొని తమ తమ పనులను జులై 10 వ తేదీనాటికి సర్దుకొని ప్రజలకు సేవచేయడానికిసంసిద్ధంకావాలి.

వలంటీర్లు యే యే గ్రామంనుండి యెంతమంది (పేర్లతోసహా) వస్తారో, జులై 1 వ తేదీకి జిల్లాకార్యాలయానికి తెలియజేయాలి. పుష్కర కమిటీవారుకూడా యువజన వలంటీరుదళానికి అన్నివిధాలా సహాయం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నాను.

బర్మా స్వాతంత్ర్య పోరాటగాథ

["పీపుల్సువార్" నుండి]

"బర్మావారు (గెరిల్లాలు) మనకేమయినా మేలుచేశారంటే-అది వారు చేయాలని చేసిన మేలుకాదు. కాకతాళీయంగా జరిగినది మాత్రమే. నిజానికి జపాను వాళ్ళకన్న, వీళ్లేమంత మెరుగు కాదు. వీళ్లకి జీత బత్యాలేమీలేవు. ప్రజల్ని దోచుకొని జీవించారు. వీళ్ళని నిరాయుధుల్ని చేయాలని గ్రామస్థులు గోలచేస్తున్నారు. మాండలే రంగంలో మనం ఓడిపోయేటంతే, వీరు అమాంతంగా రంగు మార్చి జపానువారికి సహాయంచేసేవారు."

కరుడుగట్టిన సామ్రాజ్యవాది, ఒక బ్రిటిష్ ఉద్యోగి, బర్మా గెరిల్లాల మీద కురిపించిన అక్షింతలివి. జపాను ఆక్రమణకింద నేర్చుకోవలసిన పాఠాలన్నిటినీ నేర్చుకొని, ఎన్నో త్యాగాలుచేసి, ప్రాణాల్ని గడ్డిపోచకన్న చులకనగా ఎంచి, బర్మా దేశభక్తులు నిర్మించుకొన్న "స్వాతంత్ర్య సైన్యాన్ని" ప్రపంచ ప్రజల యెదుట నీచంగా చిత్రించాలని పలికిన అవాకు చవాకులు ఇవి.

ఈ మాటలేమీ కొత్తకావు. యుగోస్లావియాలో మార్షల్ టిటో సేనల్ని "బందిపోటు దొంగలు" అన్న నోళ్ళు ఇవే! కలియుగ హరిశ్చంద్రుడు ముసోలినికి తగిన శాస్తి చేసిన ఇటలీ దేశభక్తుల్ని "వెర్రెత్తిన అరాచక గుంపుల"ని అన్న పబుద్ధులు ఈ తరగతికి చెందినవారే. చరిత్ర వీరికి తగినసమాధానం చెబుతుంది.

బర్మాలో అసలు కథేమిటి?

బర్మా పేట్రియాటిక్ ఫ్రంటు

బర్మా పేట్రియాటిక్ ఫ్రంటుకి "ఫాసిస్టు ప్రతికూల కూటమి" అని మరో పేరు. ఇదొక రాజకీయసంస్థ. దీనిసభ్యత్వం 50,000. దీని మిలిటరీ శాఖలో కొన్ని వేలమంది సాయుధ గెరిల్లాలున్నారు. "బర్మారక్షణసేన" లోంచి 10,000 మంది సైనికులు కూడా వచ్చి ఇందులో చేరారు. సుప్రసిద్ధ గెరిల్లా యోధుడయిన విన్నయతైహా నాయకత్వంకిందవున్న అరకాన్ జాతీయకాంగ్రెసు, అతని గెరిల్లా దళాలు, ఇంకా ఇతర దేశభక్తుల సంస్థలు ఇందులో ఉన్నాయి. వీటన్నిటి ద్వారా "ఫాసిస్టు ప్రతికూలకూటమి" లక్షలకొలది ప్రజల్లో పలుకుబడి సంపాదించింది. ఈ ఐక్యసంఘటనను నిర్మించడంలో బర్మా కమ్యూనిస్టుపార్టీది ప్రధానపాత్ర. అంతకు ముందొక చిన్నకూటమిగా ఉండిన కమ్యూనిస్టుపార్టీ, జపాను ఆక్రమణ కాలంలో 2000 సభ్యత్వానికి పెరిగింది.

జపానుకు తోడ్పడినదెవరు?

జపాను దండయాత్రకు పూర్వం బర్మాలో రెండు ప్రధానపార్టీలుండేవి. వీటి నాయకులు యు-సా, బా-మా లు. వీరిద్దరూ పదవులకోసం ఎంత ఘాతుకానికైనా ఒడికట్టేరకం. ఎవరి మట్టుకువారు, ఇద్దరూ జపానువారితో బేరాలు సాగించారు.

కాని జపానుకు ప్రధానంగా తోడ్పడింది "దో-బామా"(మనబర్మాసంఘం) అనేసంస్థ. ఈ సంస్థ క్రమ క్రమంగా సామ్రాజ్య వ్యతిరేక జాతీయ సంస్థగా అభివృద్ధి పొందుతూ వచ్చింది. దీనినాయకులు థకిన్లు. వీరిలో ఒక భాగం అంగ్‌సాన్‌నాయకత్వాన టోకియోవెళ్లి జపాను ప్రభుత్వంతో మైత్రి కుదుర్చుకొని, వేయితుపాకులతోను, కొంతడబ్బుతోను తిరిగి వచ్చి 'జాతీయ విప్లవపక్షాన్ని' 'బర్మాస్వాతంత్ర్య సైన్యాన్ని' నిర్మించారు. ఈ సేనలో 36,000 మంది చేరారు. ఎక్కువ మంది యువకవిద్యార్థులు, థకిన్లు, బ్రిటిష్ వారినుండి బర్మాకు స్వాతంత్ర్యం సంపాదించాలను ఆశయంతోనే వీరుచేరారు.

కమ్యూనిస్టుల ప్రతిఘటన

మొదటినుంచీ జపానును ప్రతిఘటిస్తూ నిలచిన ది శైశవావస్థలోఉన్న కమ్యూనిస్టు పార్టీ. దీని నాయకులు కామ్రేడ్సు థకిన్‌సో, థాన్‌టున్, ఘోసాల్. థకిన్‌సోకి సరి తూగగలమార్క్సిస్టు సిద్ధాంతి బర్మాలోఇంకొకరు లేరు. కొద్దిరోజుల్లో జపానువాడి ప్రారంభమవు తుండనగా, ఈ నాయకుల నందర్నీ బ్రిటిష్ ప్రభుత్వం జైళ్ళలో తోసింది. సోవియట్ ప్రజల్ని జపాను ప్రతికూల పోరాటానికి ప్రబోధిస్తూ వీరుజైళ్ళలో నుంచే ప్రకటన చేశారు. అయినా బ్రిటిష్‌వారు వీరిని విడిచి పెట్టలేదు. వీరిని అలాగేవుంచి తాముమాత్రం ఆఉళ్ళను కాళీచేసిపోయారు కూడా. చివరకిజపానుకాంబులకు జైలుగోడలు బద్దలయినప్పుడే వీరు బయటికి రాగలిగారు.

1942 మార్చిలో మార్షల్ జంగ్‌కై-షేక్ ప్రతినిధి వచ్చి, జపానును జయప్రదంగా ప్రతిఘటించడాన్ని గురించి ఈ కమ్యూనిస్టు నాయకులతో సంప్రదించి వెళ్ళారు. బ్రిటిష్ వలసదేశాలు జపానువాళ్ళ తాకిడికి పడిపోతున్న రోజులవి. ఈ విషాద పరిస్థితుల్ని అరికట్టి, జపానువారిని తీవ్రంగాప్రతిఘటించడానికి థకిన్‌సో బర్మా ప్రభుత్వానికి కొన్ని సూచనలు చేశారు. కాని, గవర్నరు డార్మన్ స్మిత్(ఇతనేతిరిగిగవర్నరుగానాబోతున్నారు) బుద్ధిమాంద్యం కొద్దీ వాటిని తృణీకరించారు. ఈ విషయమై బర్మా సి. ఐ. డి. శాఖ నాయకుడే థకిన్‌సోను కలుసుకోవాలనుకున్నప్పుడు వీల్లేదన్నాడు స్మిత్!

జపానురాక, తరవాత

బ్రిటిష్ సామ్రాజ్యవాదుల గుడ్డితనం ఫలితంగా బర్మా జపానువారి వాతబడింది. ఆ కిరాతకులు వచ్చి బర్మాలోని వివిధ పక్షాలన్నిటిని తమకు మద్దతుగా సంఘటిత పర్చాలని ప్లాను వేశారు. బామా మొదలైన 20 మంది ప్రముఖుల్ని సమావేశపరచి, తాత్కాలిక ప్రభుత్వమంటూ ఒకటి ఏర్పరచారు. తమకు సాయం చేసిన థకిన్లకు సగం స్థానాలిచ్చారు. దీనికి బామాను ప్రధానిగా నియమించారు. ఈ తోలుబొమ్మ ప్రభుత్వంకింద ప్రజలనందరినీ సమీకరించాలనే గొంతెమ్మ కోరికతో బామా ఒక నాటకమాడాడు. తన నాయకత్వం కింద ఒక సంస్థను స్థాపించాడు. దీని నినాదం "ఏకరక్తం; ఏక కంఠం; ఏకనాయకత్వం." ఇది తప్పమరే రాజకీయపార్టీ కూడా చట్ట సమ్మతం కాదని శాసించాడు. బర్మా ప్రజలతో ఒక స్వతంత్రసేన తయారు చేస్తానన్నాడు. చెట్టియార్ల భూములన్నిటినీ తీసుకొని రైతులకు పంచేస్తానన్నాడు. విద్యార్థులకు వృత్తి విద్యలను నేర్పిస్తానన్నాడు. ఇలాంటి ఆశలుచూపి తనపార్టీ సభ్యత్వాన్ని మూడు మాసాల్లో రెండు లక్షలకు పెంచుకున్నాడు.

ఎదురెత్తు

ఈ పరిస్థితుల్లో థకిన్లలోని ఫాసిస్టు వ్యతిరేక వర్గంవారు ఒక ఎదురెత్తువేశారు. "దేశరక్షణకోసం బర్మా యువకులందరూ సంఘటితం కావాలి" అని ఒక ఉద్యమం ప్రారంభించారు. దేశరక్షణ ఎవరినారినుండి? అన్న విషయంమాత్రం వెల్లడిచేయకుండా వదలి పెట్టారు ఇక చూసుకోండి! బ్రిటిష్‌వారి నెదుర్కోడానికే ఈ ఉద్యమం అని భ్రమపడ్డారు జపానువాళ్ళు. తన పార్టీకి కావలసినసభ్యులనందర్నీ ఇందులోంచి తీసుకోవచ్చు ననిమురిసిపోయాడుబామాఇతనివ్వాలాజపాను వారీ ఉద్యమానికి రు. 60 వేలిచ్చారు. యువకుల్నందర్నీ ఈ ఉద్యమం ఉత్తేజపరిచింది. ఒక్క సంవత్సరంలో 30,000 మంది సభ్యులు చేరారు.

ఈ ఉద్యమంలో జరిగిన పనేమిటి? కమ్యూనిస్టుల నాయకత్వాన జపాను వ్యతిరేక ప్రచారం మహా విరివిగా సాగింది. ఇందులోనుంచే "బర్మారక్షణ సేన"ను తయారుచేశారు. ఈ విధంగా, మొదట్లో జపానువారి అధిక సహాయం పొందిన ఈ సంస్థ జపానుని ప్రతిఘటించడానికి ఒక కంచుకోటగా తయారయింది. విధివిహీనంలేని ప్రజాసేవద్వారా దీని సభ్యులు పెద్దల ఆదరాభిమానాలనుచూరగొన్నారు. ఈ సంస్థద్వారా పనిచేస్తూ కమ్యూనిస్టు యువతులు మహిళలను సంఘటిత పరిచారు.

బర్మా రక్షణ సేన

బ్రిటిష్‌వారిని తరిమివేసి బర్మాకు స్వాతంత్ర్యం సంపాదిద్దామనేవెర్రిఆశతో చాలమంది "బర్మా స్వాతంత్ర్య సైన్యం"లో చేరారు. కాని, త్వరలోనే ఆశాభంగం పొందారు. వారిలో దేశభక్తి చావలేదు. అందువల్లనే కమ్యూనిస్టులు వీరిలో నూతన కార్యదీక్షను రేకెత్తించగలిగారు. ఈ సేనపేరే "బర్మా రక్షణ సేన"గా మారింది. కమ్యూనిస్టులు దీనిలోచేరి సైనికుల్లో ఎంతోమార్పు తెచ్చారు. ఈ సేనకు అధిపతి అయిన అంగ్‌సాన్ దగ్గరకు థకిన్‌సో స్వయంగావెళ్ళి చర్చించాడు. జాతీయ అంతర్జాతీయ పరిస్థితులను స్పష్ట పరిచాడు. జపానుని ప్రతిఘటించవలసిన అవసరాన్ని బోధించాడు. అంగ్‌సాన్‌లో ప్రజలంటే అభిమానం పూర్తిగా చావలేదు. కాబట్టి, కొంతవరకు మారాడు. థకిన్‌సోకి తెలుసు—జపానువారికి తానుపట్టుబడితే ఘోర మరణం తప్పదని. అయినా సాహసించి అంగ్‌సాన్‌లో మార్పుతెచ్చాడు. నాటినుండి అంగ్‌సాన్ బర్మా రక్షణసేనలో బానిసభావాలను పారదోల నారంభించాడు. స్వతంత్ర భావాలను నూరిపోయ సాగారు.

"బర్మా రక్షణసేన" లోని సైనికులకు జాతీయ అంతర్జాతీయ విషయాల మీద పాఠాలు నేర్పారు. బర్మా ప్రజలే బర్మాను ఎలా పరిపాలించుకోవాలో బోధించారు. నిరంకుశత్వాన్ని, ఆక్రమాలను - ఎక్కడైనా సరే ఏవిధంగా ఎదుర్కోవాలో వివరించారు. బర్మా స్త్రీలు తమ ఆత్మగౌరవాన్ని, దేశం యొక్క గౌరవాన్ని ఎలా కాపాడాలో బోధించారు. ఈ విధంగా "బర్మా రక్షణ సేన" జపానువారి నుండి దేశాన్ని విముక్తిచేసి, స్వాతంత్ర్యాన్ని స్థాపించగల ఒక మహా సంస్థగా అభివృద్ధిపొందింది. ఈనాడు దీనిలో 6 వేలమంది బర్మా దేశస్థులు, 3 వేలమంది తెలంగీలు 1000 మంది కారెన్లు - ఇంకా వివిధ జాతులవారు పరస్పర సోదరభావంతో పనిచేస్తున్నారు. చైనావారు, భారతీయులు కూడా ఉన్నారు. మొత్తంసభ్యత్వం 10,000. మరో 10 వేలమంది రిజర్వులో ఉన్నారు. దీంట్లో నూరింట - పదిమంది పై తరగతులవారు. 45 మంది మధ్యతరగతివారు. మిగిలిన 45 మంది కార్మికులు, కర్షకులు.

మిత్రరాజ్యాలతో భుజం భుజం కలిపి జపాను మూకల్ని తరమాలనే దీక్ష వీరందరిలో కలిగింది.

కత్తులు దూశారు

బ్రిటిష్ సేనలు మాండలే నగరాన్ని సమీపిస్తున్న రోజులవి. అక్కడున్న "బర్మారక్షణ సేన"కి బోలా హూటు నాయకుడు. గెరిల్లా యుద్ధం ప్రారంభించండి అని సందేశం ఇచ్చాడు. అక్కడున్న జపాను రాజకీయ సలహాదారుల్లోఒకనినిచంపి, ప్రారంభోత్సవం చేశాడు. అక్కడి బర్మారక్షణసేన దళాలు చుట్టుప్రక్కలనున్న కొండల్లోకి పోయాయి. జపానువారిని ముప్పతిప్పలు పెట్టి మూడు చెరువులనీళ్లు త్రాగిస్తూ, మిత్ర సేనలకు అన్ని విధాల సాయపడవలసిందని గ్రామసీమలలో ప్రజల్ని ఉద్బోధించాయి. అరకాన్, మధ్య బర్మా, పెగు, టోంగూ - ఎక్కడపడితే అక్కడేగెరిల్లాపోరాటాలు ప్రారంభమయాయి. బ్రిటిష్ మిలిటరీ అధికారవర్గమే ఈ విషయాన్ని తమ ప్రకటనల్లో అంగీకరించారు.

ప్రజలు చేతికందిన జపానువాళ్ళను ఏది దొరికితే దానితో చంపసాగారు. డాహుట్టా అనేచోట ఒక 15 ఏళ్ళ కుర్రవాడు ఒక జపాను సైనికోద్యోగిని చంపాడు.

ఒకచోట బ్రిటిష్ సైనికులు విమానాల్లోంచి బుట్ట గొడుగులద్వారా దిగినప్పుడు జపాను వాళ్ళలో కంగారు పుట్టింది. ఆ ప్రాంతంలో ఉన్న కొంతమంది రైతులు జపానువారి మీది కురికారు. తమ దగ్గరున్నవి మూడే తుపాకులయినా, 15మంది జపానువాళ్ళనుచంపారు. వారి గోదాముల్లో ఉన్న బట్టలు, ఆహారపదార్థాలు మొదలైనవాటిని తీసుకువెళ్ళి గ్రామస్థులకు పంచిపెట్టారు. ఈ గెరిల్లాల విషయమై రాస్తూ 'స్టేట్సుమన్' విలేఖరి ఇలాఅన్నాడు:

"ప్రజలు తిరగబడతారన్న భయం వలన జపాను వారు రంగూనును ఖాళీచేసి ఉంటారు. ఆచర్యకు మరోకారణం కనబడడం లేదు."

"స్వతంత్ర బర్మా"

బర్మా ప్రజల స్వాతంత్ర్యోద్యమం ఇలా బలపడకుండా అరికట్టడానికి జపానువారు, వాళ్ళ బంటు బామా మరోఎత్తు వేశారు. బర్మాకు స్వాతంత్ర్యం ఇచ్చేశామని ప్రకటించారు. 1944 సెప్టెంబరులో బామా "స్వతంత్ర బర్మా పార్టీ" అంటు ఒకటి స్థాపించారు. ప్రతిబర్మాపౌరుడుఇందులో సభ్యుడేఅన్నారు. ఇందులోకూడా ప్రవేశించి బర్మా స్వాతంత్ర్య యోధులు తమ రహస్యోద్యమాన్ని విరివిగా సాగించారు. ఈ సంస్థ తరపున ఉన్న మోటార్లలోనే రహస్య కరపత్రాలను, పుస్తకాలను వివిధ ప్రాంతాలలో పంచేవారు.

ఈవిధంగా జపానువారు, బామా వేసిన ఎత్తులన్నీకూడా వాళ్ళకే ఎదురు తిరిగేలా చేశారు, బర్మా పేట్రియాటిక్ ఫ్రంటువారు. దీనిలో ప్రధానపాత్ర బర్మా కమ్యూనిస్టుపార్టీది. బర్మా అంతటా దీనికి పలుకుబడి ఉంది. ఇంత బలం దీనికెలా (మిగతా 7 వ పేజీలో)

జర్మన్ ప్రజలపట్ల సోవియట్ శ్రద్ధ

["పీపుల్సువార్" నుండి]

రెడార్మీ సైనికులు బెర్లిన్ ప్రజల దుస్థితిని గూర్చి రాసిన జాబుల్లో కొన్నిటిని ఉదహరిస్తున్నాడు మికోయాన్.

ఇ.ఏ. వెరెమ్యేవ్ ఇలా రాశాడు:

"బెర్లిన్‌లోని జర్మన్లు చాల క్లిష్టస్థితిలో ఉన్నారు. వాళ్ళకి రొట్టె లేదు. కావలసిన వస్తువులు కూడా లేవు. హిట్లరు హయాములో చివరి మాసాల్లో వీరికి రొట్టె, మాంసము, బొత్తిగా ఇవ్వలేదు. వాటి కోసం పాపం, వారిప్పుడు అల్లాడి పోతున్నారు."

ఐ. రోమెన్‌స్కాయా ఇలా రాసింది:

"బెర్లిన్‌లో కరువుదేవత గజ్జెకట్టింది. బెర్లిన్ చుట్టు కూడా వందలకొద్దీ మైళ్ళ విస్తీర్ణంలో జర్మన్లు ఆకలితో చచ్చిపోతున్నారు."

"బెర్లిన్ పౌరులు ఆకలిమంటలతో మాడిపోతున్నారు. రోడ్లమీద రాలేగింజలకోసం కూడా కాకుల్లా మూగుతున్నారు."అని ఇస్టోమిన్ రాశాడు.

"మనం రాకముందే జర్మన్లు పస్తులుపడుతున్నారు". అంటాడు వి. ఏ. ఇవనోవ్.

"బెర్లిన్‌లో అనేక ప్రాంతాల్లో జర్మన్ పౌరులు చచ్చిపోయిన గుర్రాలను కోసుకు తింటున్నారు. గడ్డి, చెట్లువేరళ్ళకుకూడా ఎగబడుతున్నారు." అని రాశాడు, ఎన్. ఆల్ట్మాన్.

ఇంకా ఇలాంటి జాబులెన్నో ఉన్నాయి.

సోవియట్ ఆదర్శాలు

డ్రెస్డెన్ ప్రజలస్థితి కూడా ఇంచు మించు ఇదే. ఈపరిస్థితులు సోవియట్ సేనలకు చాల ప్రమాదకరమని వేరే చెప్ప నక్కర లేదు. కరువు పరిస్థితుల ఫలితంగా జాడ్యాలు కూడ ప్రబలి సైనికులకు ప్రమాదంకలిగించగలవు.

అంతేకాదు. శత్రురాజ్యమైనప్పటికీ అక్కడి ప్రజలు ఇలా అల్లాడిపోతుంటే చూస్తుకూర్చోడం సోవియట్ ప్రజల స్వభావంకాదు. ఓడింపబడిన దేశంలో ప్రజలపట్ల మానవసహజమైన దయాదాక్షిణ్యాలతో ప్రవర్తించడం సోవియట్ నీతిసూత్రం. అదే సోవియట్ పౌర సంప్రదాయం. లోగడ సుప్రసిద్ధ రష్యన్ మిలిటరీ నాయకుడు సువరావ్ ఏమన్నాడు?

"కత్తిపట్టి నిల్చినంత కాలం శత్రువుని దయాదాక్షిణ్యాలు లేకుండా చావగొట్టు. కానీ ఓడిపోయిన తరువాత, ముఖ్యంగా ప్రజాసామాన్యం పట్ల, ఉదారభావంతో ప్రవర్తించు."

"కిందపడ్డ వానిమీద మరిచెయ్యెత్తకు" అని రష్యాదేశంలోఒక లోకోక్తికూడాఉంది. సోవియట్ ప్రజల స్వభావాన్ని తెలపడానికి ఈ రెండు మచ్చుతునకలు.

సప్లయిలు

అందువల్లనే మార్షల్ జుకొవ్ నాయకత్వాన బెర్లిన్‌లోను, మార్షల్ కోనీవ్ నాయకత్వాన డ్రెస్డెన్‌లోను పరిస్థితులను చక్కబరచి నివాసయోగ్యం చేయడానికి సోవియట్ అధికారవర్గం పూనుకుంది. మొట్టమొదట జరిగిన పని ప్రజలకు కావలసిన ఆహారపదార్థాలను సఫరరా చేయడం. హిట్లరు హయాములో పొందిన చాలీచాలని రేషన్లకన్నా ఎక్కువగా సప్లయి చేయడం ప్రారంభించారు.

ఈ రెండు నగరాలకు కావలసిన సరుకంతా జర్మనీలోనే దొరుకుతుందని పరిశోధనపై తేలింది. కాని జర్మన్ పరిపాలక సంస్థలు ఎంత చిందరవందర అయాయంటే, తమ చేతిలో ఏమున్నదో తమకే తెలియని స్థితిలో ఉన్నారు జర్మన్లు. అందువల్ల మునిసిపాలిటీలను తిరిగి స్థాపించి, వాటి ద్వారా ప్రజలకు కావలసిన సరకులు సక్రమంగా అందివ్వడానికి సోవియట్ అధికారవర్గం పూనుకుంది.

నాజీలక్రింద రైతులు

నాజీ శాసనాల ప్రకారం రైతులు తమ అవసరాలకు, విత్తనాలకు పోను మిగతాపంటనంతా ప్రభుత్వానికి తక్కువధరలకు ఇచ్చివేయాలి. బంగాళా దుంపలు, మాంసం మొదలయినవి వేటినీ అమ్ముకునే హక్కు రైతుకులేదు. దీని ఫలితంగా రైతుకి ఎక్కువ పంటపండించాలనేఉత్సాహమే లేకపోయింది. జర్మన్‌పట్టణాలలో ప్రజలకు పొట్టనిండాతిండి దొరకాలంటే ప్రభుత్వానికి ఇచ్చుకున్నదిపోను మిగతా ధాన్యాదులను స్వేచ్ఛగా అమ్ముకునే హక్కు రైతుకుండాలి.

నిత్యజీవితావసర వస్తువుల వ్యాపారాన్ని నాజీలు పూర్తిగా నిషేధించారు. మార్కెట్లను మూసివేశారు. రేషన్ ప్రకారం దొరికే బహుకొద్దిసప్లయితోనే బెర్లిన్ ప్రజలు తృప్తిపడవలసివచ్చింది. ఈపరిస్థితులను సరిచేయడానికి సోవియట్ అధికారవర్గం బెర్లిన్ నగరంలో వ్యాపార సౌకర్యాలు విరివిగా కలిగించింది. పట్టణంలో జీవిత పరిస్థితులు బాగుపడడానికి ఇవి చక్కగా ఉపయోగపడ గలవు.

నాజీ విషానికి విరుగుడు

యుద్ధం ముగిసీ ముగయగానే బెర్లిన్, డ్రెస్డెన్ నగరాల్లో నీళ్ళ సప్లయి, విద్యుచ్ఛక్తి కేంద్రాలను, మురుగు సౌకర్యాలు, రాకపోకలు మొదలైనవాటిని సరిచేయడానికి రెడార్మీ దళాలు పూనుకున్నాయి. జర్మన్లచేతనే ఈ పనులు చేయిస్తూ రెడార్మీ ఇంజనీర్లు అజమాయిషీ చేస్తున్నారు.

రెడార్మీ సైనికులంటే భూతాలు, పిశాచాలుగానూ, నరభక్షకులుగానూ నాజీలు వర్ణించి వర్ణించి, జర్మన్ ప్రజలను బెంబేరెత్తించారు. రెడార్మీయోధులు నగరంలోకి వచ్చారనే సరికి ఎంత ఘోరంగా కసితీర్చుకుంటారో అని ఆ బాల గోపాలం ప్రాణాలరచేత పట్టుకున్నారు. ఇప్పుడు రెడార్మీవారు దయామయులుగా ప్రవర్తిస్తున్న తీరే, నాజీలు నూరిపోసిన ఆవిషానికి విరుగుడుగా పనిచేస్తోంది. తమ ఆహారపదార్థాల సప్లయిని గురించి, తమ జీవిత సౌకర్యాలను గురించి రెడార్మీ తీసుకుంటున్న శ్రద్ధకు జర్మనుప్రజలు ఆశ్చర్యపోతున్నారు. రెడార్మీ తలపెట్టిన కార్యక్రమానికి ఎంతో ఉత్సాహంతో సహకారం చేస్తున్నారు. బెర్లిన్ ప్రజల ప్రాణాలిప్పుడు కుదుటబడ్డాయి. ఇంతవరకు దాగున్న కంతల్లోంచి ఎందరోబయటికి వస్తున్నారు. ఆరేళ్ళకు మళ్ళా దీపాలుచూచి సంతోషిస్తున్నారు.

తాము దండనార్హులమేగాని, ఔదార్యానికి తగమనిభయపడినబెర్లిన్ ప్రజలు, అన్నివర్గాలవారు, అన్ని వృత్తులవారు రెడార్మీ ప్రవర్తనపట్ల తమ ఆశ్చర్యాన్ని, కృతజ్ఞతను నిస్సంకోచంగా వెలిబుచ్చుతున్నారు.

డాక్టర్ షెపర్ (ఒక వైద్యుడు) ఇలా అన్నాడు:

"కొత్త రేషన్లు ప్రకటించిన తరువాత వైద్యులందరికీ పండగలాగుంది. మా జర్మన్ జాతి రష్యన్లకు కలిగించిన అపారనష్టానికి ప్రతిఫలంగా కఠినశిక్షలకు మేము ఎదురు చూచాము. ఇంత ఉదారబుద్ధితో మమ్మల్నిచూస్తారనికలలో నయినా అనుకోలేదు. హిట్లరు, గోబెల్సులు కూలదోసిన వాటి నన్నిటినీ రెడార్మీ తిరిగి నిర్మిస్తూంది. నాజీల అసత్య ప్రచారానికి ఇంతకన్నా గొప్ప జవాబింకేముంటుంది?"

సంగీత అధ్యాపకుడు రుడాల్ఫ్ క్రున్ ఇలా అన్నాడు:

"రష్యన్ల రాక్షసత్వం అంటూ, గోబెల్సు చేసిన ప్రచారాన్ని మేము నమ్మాము. రెడార్మీలో ఇంత ఉదారస్వభావం గలదని మేమనుకోలేదు. ఇక ఆహారాన్ని గురించా — పస్తులుపడి చావడమే మా గతి అనుకున్నాం. ఇలా మునుపటికన్నా ఎక్కువగానే సప్లయిలు దొరుకుతాయని అనుకోలేదు"

ఇంజనీరు రిచర్డు స్టంప్ ఇలాఅన్నాడు:

"సోవియట్ ప్రభుత్వంపట్ల నా కృతజ్ఞతకు మేరలేదు. రష్యన్లుమాకు ఆహారం సప్లయి చేయడమేకాదు-మామావృత్తులనుబట్టి ఆహార పదార్థాల సప్లయిలను నిర్ణయించారు. కష్టజీవులకు, శాస్త్రపరిశోధకులకు, ప్రొఫెసర్లకు ప్రత్యేక రేషన్లు నిర్ణయించారు. విజ్ఞాన వేత్తలను సోవియట్ ఎంతో గౌరవిస్తుందని ఇప్పుడే తెలుసుకున్నాం!"

నూతన జీవితం

ఎలక్ట్రిక్ కార్మికుడు ట్రుయెంబర్గ్ ఇలా అన్నాడు:

"చీకటిరాత్రులు గడచిపోయాయి. రష్యన్లు జర్మన్లనందరిని సైబీరియా మంచు బీళ్ళలోకి పంపిస్తారని నాజీలు మమ్మల్ని హడలుగొట్టారు. అదంతా పచ్చిఅబద్ధమని ఇప్పుడు తేలింది. మమ్మల్ని అవమానించి, నాశనం చేయాలనే ఉద్దేశం రష్యన్లకు లేనేలేదని స్పష్టమవుతూంది. ఉజ్వలమైన నూతన జీవితపు అరుణోదయాన్ని చూస్తున్నాం."

ఎలిజబెత్ స్టీం అనే ఒక ఇల్లాలు ఇలా అంది:

"రష్యాయుద్ధంలో పాల్గొన్న ప్రతిజర్మను సైనికుని కుటుంబాన్నీ రష్యన్లు కాల్చిచంపేస్తున్నారని నాజీలు ప్రచారం చేశారు. నా బిడ్డల గొంతుకలుకోసి, తరువాత ఆత్మహత్య చేసుకుందామనుకున్నాను. కాని ఆ పనికందులను చూచేసరికి నాగుండె కరిగిపోయింది. వాళ్ళని పొట్టకదుముకొని నేలకొట్టులోకిపోయి కూర్చున్నాను కొన్నాళ్ళు ఆకలిమంటలకు మాడిపోయాం. అలాగే చచ్చిపోతామనుకున్నాను. ఇంతలో ఒకనాడు హటాత్తుగ రెడార్మీ సైనికులాకొట్టులోకి వచ్చారు. ప్రాణాలెగిరిపోయినంత పనయింది. కాని వారు మమ్మల్ని తాకనయినా తాకలేదు. ఎంతో దయతో మాకురొట్టెలిచ్చారు. నాచిన్ని వెర్నరుకుమిఠాయికూడాపెట్టారు. మమ్మల్నందరినీ ఆకలిమంటలనుండి కాపాడ్డానికి సోవియట్ అధికారులెలా పాటుపడుతున్నారో కళ్ళార చూస్తున్నాను."

టిర్ పెన్స్బర్గులో ఆహారశాఖ అధికారి డైరక్టరు జుంకె ఇలా అన్నాడు:

"నాజీలు చెప్పినదంతా పచ్చి అబద్ధాలని ఇప్పుడు గుర్తిస్తున్నాం. నిజానికి గత జర్మన్ ప్రభుత్వంకన్నా మార్షల్ స్టాలిన్ మాపట్ల ఎక్కువ శ్రద్ధతీసుకుంటున్నాడు.

ఏ. ఐ మికోయాన్ సోవియట్ సహాయ ప్రధానులలోఒకరు. విదేశవ్యాపారశాఖ మంత్రి కూడాను. ఈమధ్య బెర్లిన్, డ్రెస్డెన్ నగరాలకు వెళ్ళి, అక్కడి ఆహార పరిస్థితుల్ని పరిశీలించి వచ్చారు. తిరిగివచ్చి మాస్కోలో "ప్రవ్దా" విలేఖరితో ఈ దిగువ విషయాలు చెప్పారు:

బెర్లిన్‌లో ప్రజల ఆహారపరిస్థితి చాలవిషమంగా ఉందనీ, అసలక్కడ ప్రజలు జీవించడమే దుర్భరంగా ఉందనీ, రెడార్మీ సైనికులు, అధికారులు సోవియట్ ప్రధానకార్యాలయానికి రిపోర్టులు పంపారు. కూలిపోయిన ఇళ్ళలోను, నేలకొట్లలోను, వెల్తురు, నీళ్లు, మురుగుసౌకర్యాలు లేని స్థితిలో, నిత్యోపవాసాలుచేస్తూ బెర్లిన్ ప్రజలు అల్లాడిపోతున్నారని వారు రాశారు. రెడార్మీ సైనికులెక్కడ కనబడితే అక్కడ పసిపిల్లలు, ముసలివారు గుంపులు గుంపులుగా పోగయి, రొట్టె ముక్కల కోసం ఎంతో జాలిగా చేతులు చాస్తున్నారట. రెడార్మీ భోజనశాలలదగ్గరి దృశ్యం చెప్పతరం కాదట.

(6 వ పేజీ తరువాయి) వచ్చింది? బర్మాలో ఉన్న వివిధ జాతుల సంపూర్ణ రాజకీయ, ఆర్థిక, వైజ్ఞానిక హక్కులను అంగీకరించి, ఆవిధంగా వివిధజాతుల ఐక్యసంఘటనను నిర్మించింది. జాతి, మత స్వాతంత్ర్యాలూ, హెచ్చుజీతాలు, తక్కువ పనిగంటలు, ఆరోగ్య భీమాలు, వ్యవసాయ రంగంలో తగిన సంస్కరణలు - ఈవిధమయిన అభివృద్ధికర కార్యక్రమాన్ని నిర్ణయించడమే ఈసంస్థ బలానికి కారణం.

వినాశకర విధానం

ఇలాంటి అకళంక దేశభక్తులపైని డార్మన్ స్మిత్‌ద్వారా బ్రిటిష్ ప్రభుత్వం తిరిగి దాడి ప్రారంభించింది. ఇదివరకు బ్రిటిష్‌వారిపట్ల వ్యతిరేకభావం చూపిన వారినందర్నీ తిరిగి జైళ్ళలో తోస్తున్నారు. వీరు తమ దృక్పథాన్ని మార్చుకొని, జపానువారిపై కత్తిదూసి, బర్మా విముక్తికి తోడ్పడ్డారన్న విషయాన్ని మరచిపోయారు. జపాను ఆక్రమణ కాలములోఉన్న అవకాశాలన్నిటిని ఉపయోగించి స్వాతంత్ర్యోద్యమాన్ని నిర్మించారీయోధులు. చివరకు దీనికోసం జపాను చేతికింద మంత్రివర్గంలోకి తమ వారి నొకరిని పంపారుకూడా. ఇలాంటి వారిని అణచిపెట్టి బర్మా పునర్నిర్మాణం సాగిస్తామనుకోడం పగటి కలలుకనడం. అది వినాశకర విధానం.

రైల్వేకార్మికుల సభనుంచి

విచ్ఛిన్నకారుని పలాయనం

ఎమ్. ఎస్. ఎమ్. రైల్వే యెంప్లాయీస్ యూనియన్ అభివృద్ధిని అరికట్టుటకు యజమానుల యేజంట్లయిన కొద్దిమంది స్వలాభపరులు బెజవాడలో తలెత్తి, మొదట ముస్లిం యెంప్లాయీస్ అసోసియేషన్ అనే పేరుతో నామమాత్రపు పోటీసంఘాన్ని స్థాపించారు. పనివారందరు, ముస్లిం పనివారు సహితం దీని బూటకత్వంతెలుసుకొని సభ్యులుగాచేరకుండా వుంటుంటే. ఒక్క ముస్లింపనివారి సంఘంగానే కాకుండా పనివారందరి సంస్థగా చూపెడితే సభ్యత్వ మెక్కువై బలపడుతుందనే ఆశతో మొదటి పోరుమార్చి ఎమ్. ఎస్. ఎమ్ రైల్వే స్టాఫ్ అసోసియేషన్' అని పేరు పెట్టారు.

తమ విచ్ఛిన్న కార్య క్రమాన్ని మరుగు పర్చుకొనుటకు. పనివారలను మోసగించుటకు. "పాత యూనియన్ కమ్యూనిస్టుల ప్రాబల్యంకింద వున్నదనీ పనివారల. సమస్యలను వదలేసి రాజకీయాలలోకి యీడుస్తారనీ. నానారకాలుగా తప్పుడు ప్రచారం చేయటం మొదలు పెట్టారు. కాని పని వారెవరూ మోసపోలేదు.

ఈ విచ్ఛిన్నకారులు పనివారలను మోసగించి యెలాగైనా కొంతమందిని తమ అనామక సంఘంవైపు తిప్పుకొనుటకు అనేక అర్భాటాలు చేస్తున్నారు. వీరి ప్రెసిడెంటు షేక్ మదార్ 1932లో జరిగిన హుబ్లీ సమ్మెలో హిందూ ముస్లిం తగాదాలు తీసుకొచ్చి, దాన్ని నాశనం చేసినటువంటి వాడు. ప్రస్తుతం తన ఆడిటర్ అధికారాన్ని ఉపయోగించుకొని, స్టేషన్ మాస్టర్లను భయపెట్టి సభ్యులుగా చేర్చుకోచూస్తున్నాడు. ఈవిధంగా అయినా యెక్కువమంది చేరకుండా వుంటే సభ్యత్వ రుసుమును చెల్లించక పోయినా పేర్లు రాసుకొని, తమ సంఘంలో యెంతో మంది చేరారన్నట్లుగా ప్రచారం చేస్తున్నాడు. "అధికారులకూ మాకూ సంప్రతింపులు జరుగుతున్నాయి. రికగ్నిషన్ యిస్తారు" అని ప్రచారం చేస్తున్నాడు. కాని ఈ నాటక మేమీ పని చేయడంలేదు.

ఈతడు యీమధ్య బిట్రగుంటకువచ్చి మీటింగు పెట్టాడు. మీటింగుకు యూనియన్ బ్రాంచివారు పోటీసంఘం యొక్క బూటకత్వాన్ని బట్టబయలు చేయుటకు చాలామంది పనివారిని తీసుకువెళ్ళారు. మదార్ ఉపన్యాసానంతరం వర్కర్సు అనేకప్రశ్నలు వేశారు. బ్రాంచి అధ్యక్షులైన కామ్రేడ్ ఎ. వి. కృష్ణయ్య పనివారు వేసిన ప్రశ్నలకన్నింటికి సమాధానం యిచ్చి పోవలసినదని కోరగా, మొదట మదార్ అంగీకరించాడు. పనివారందరు ప్రశ్నలమీద ప్రశ్నల కురిపించటం మొదలు పెట్టారు. మదార్ గ్రూపుకు సంబంధించిన ఒకతను ఉడుకుబోతు తనంతో టి. సుందరమూర్తి అనే కామ్రేడ్‌ని కొట్టటానికి చేయియెత్తాడు దీనిని సహించలేక కొంతమంది కార్మికులు తన మీద చేతులు యెత్తేటప్పటికి, తాను సుందరమూర్తిమీద ఎత్తిన చేతిని కిందకు వాల్చాడు. ఇదే సందు అనుకొని మదార్ తన ఫైల్సు సంచిని చంకన పెట్టుకొని ప్రశ్నలకు సమాధానాలు యివ్వకుండానే సభ నుంచి వెళ్ళి పోయాడు. వెళ్ళిపోతూంటే, సమాధానాలు యిచ్చి పొమ్మనమని చేయిపట్టుకొని లాక్కొస్తున్నా రాకుండా విదిలించుకొని వెళ్ళిపోయినాడు.

ఆ దేసభను బ్రాంచివారు సాగించి, మదార్ యొక్క విచ్ఛిన్నపాత్రనుగురించి విపులంగా తెలియచెప్పినారు. మరినాడు మరుయొక బహిరంగసభను 300 మంది పనివారితో సమావేశపర్చారు. ముస్లిం పనివారు వుపన్యసిస్తూ మదార్ విచ్ఛిన్నచర్యలను ఖండించారు. యజమాన్లు పనివారి ఐక్యతను నాశనం చేయుటకు ఇలాంటి కొంతమంది ఏజంట్లను పట్టుకొని వారిచేత నాటకమాడిస్తారని. పనివారు యీ ద్రోహులను దూరంచేయవలసినదని ఉపన్యసించారు.

— పోలేపెద్ది నరసింహమూర్తి

★

జోహారులు

కామ్రేడ్ కళారు వెంకయ్య వెంట్రపడ, కృష్ణా) వయస్సు 19. 1943 నవంబరులో యంగ్ కమ్యూనిస్టుగా జేరి, అప్పటినుంచి యువకులకు ఆటలు, రాత్రి పాఠశాలద్వారా యువజన సంఘమునకు తోడ్పడుచూ, మొన్న మే 20 వ తారీఖున మశూచికంవచ్చి మరణించాడు. యువజనసంఘములోఉండి, ప్రజాసేవజేస్తూన్న ఆకామ్రేడ్ అకాలమరణంచెందినందుకు విచారించుచున్నాము. అతని తలిదండ్రులకు మా సానుభూతి తెలియజేయుచున్నాము.

బెజవాడ తోళ్ళకార్మికుల విజయం

— ఎల్. వి. రత్నం

బెజవాడ తోళ్ళషాపులలో పనిచేయు కార్మికులు దాదాపు 800 కు పైగా ఉన్నారు. వీరంతా 11 షాపులలో పనిచేస్తారు. వీరి పరిస్థితులుచూస్తే ఎట్లా జీవిస్తున్నారాఅన్న సందేహం కలుగుతుంది. వీరంతా క్రైస్తవ మతానికిచెందినవారు. కొద్దిమందితప్ప మిగతా కుటుంబాలన్నీ తోళ్ళషాపులలో యజమానులేర్పరిచిన చట్టుగుడిసెలలో నివసిస్తారు. ప్రతికుటుంబంలో సగటున 3 గ్గురు పెద్దలు. 3 గ్గురు పిల్లలు వుంటారు. వీరంతా పట్టణ ప్రజలకు సంబంధం లేకుండా ఒకప్రక్కన వుండిపోయారు. ఈ కార్మికులలో నూటికి ఇద్దరు కూడా చదువుకున్నవారు లేరు ఇక వీరి పిల్లలవిషయం వేరే చెప్పనవసరంలేదు. ఈ మధ్యనే మిషనరీ బడిమాత్రం పెట్టుకున్నారు. మొత్తంమీద యీ కుటుంబాలవారంతా 100కి 60 మంది జబ్బులతోనూ, సరిఅయిన తిండి లేకనూ బాధపడుతున్నారు. ఈ విధంగా యింత దరిద్రంతో బాధపడే కార్మికులు పట్టణంలో మరెవరూలేరని చెప్పవచ్చు. దీనికి ముఖ్యకారణం కార్మికులగోడు యజమానులు లక్ష్యపెట్టక పోవడమే. రోజంతా రెక్కలు విరగ్గొట్టుకొని చాకిరిచేసినా, 0-6-0 డబ్బులు గిట్టుబాటుకావడం మహాకష్టం. ఈ స్వల్ప ఆదాయంతోనే కుటుంబమంతా జీవించాలి. ఈ విధంగా జీవించలేక ఎంతోమంది యువకులు మిలటరీలో చేరారు. కొన్ని కుటుంబాలు యితర పట్టణాలకు తరలిపోయాయి. గడచిన 4 సంవత్సరాలలో కార్మికుల జీవితావసర వస్తువులన్నింటి ధరలు 4 రెట్లు పెరిగాయి. ఈ పెరుగుదలనుబట్టి దేశంలో ముఖ్యంగా ఈ పట్టణంలో, వివిధ కార్మికులు రు. 16-0-0 నుండి, రు. 20-0-0 వరకు కరువుభత్యం సంపాయించుకోగలిగారు. కాని యీ నిర్భాగ్య తోళ్ళకార్మికులకు వారి యజమానులు రు. 2-0-0 మాత్రమే కరువుభత్యం 8 మాసాలక్రింద యిచ్చారు. అంటే యితర కార్మికులురోజుకు0-8-0 మొ॥0-12-0 వరకు కరువుభత్యము కళ్ళచూస్తుంటే. వీరికి 0-1-0 మాత్రమే.

అసలు యీ కార్మికులు చేయుపని, పీస్‌రేటు పద్ధతి. ఈ పేస్‌రేటు ప్రకారం సన్నం పనికి (అంటే 200 పచ్చి తోళ్ళు సున్నంలో వేయడానికి) రు. 0-4-9 న్నూ, సున్నంలో వేసిన తోళ్ళలో 150 పైకి తీసి బొచ్చుతీస్తే. రు. 0-4-0 న్నూ సున్నంలో వేసిన తోళ్లలో 150 పైకి తీసి, బొచ్చుతీస్తే 0-4-9 లున్నూ వాటినే తిరిగి సలప పని. చక్కపని-చేస్తే రు. 0-8-0 యిస్తారు. ఈ పైరకం పీస్‌రేటు పని ప్రతి కార్మికుడు సగటున రోజుకు 8-6-0 కంటే మించి చేయలేదు. 1938 నుండి యిప్పటికి ఆరేట్లనే యిస్తున్నారు. ఈపని చేయడములో కార్మికులకు ఏవిధమైన సదుపాయాలు లేనందునచేతులు - కాళ్ళునరుకోవడం-సున్నం తినివేయడం జరుగుతోంది.

యజమాలు చీటికి మాటికి బండబూతులు తిట్టి - భయపెట్టి యిండ్లవద్ద - షాపులవద్ద వెట్టిచాకిరి చేయించుకుంటారు. వెట్టిచాకిరి చేయనంటే, ఆరోజు ఆకార్మికులను షాపుల నుండి బయటికివెళ్ళగొట్టిస్తారు. కార్మికులలో తగవులు, చీలికలుపెట్టి ఐక్యత లేకుండా చేయాలని పన్నాగాలను పన్నుతూ వచ్చారు.

కాని యజమానుల కుట్రలు ఎంతకాలం సాగుతాయి? ఒకప్రక్క డొక్కలుమాడుతూ కటిక దరిద్రంతో బాధపడుతూన్న కార్మికులు ఒక్కసారి తెగించారు. యజమానుల పన్నుగడలన్నీ భగ్నమయ్యాయి. పోలీసు బెదరింపులకు లక్ష్యం చేయకుండా, మాకు కరువుభత్యం-కూలిరేట్లు పెంచాలంటూ 11 షాపుల కార్మికులు యజమానులను అడిగారు. ఇంతటితో పూరుకోకుండా యితర కార్మికుల మాదిరిగా సంఘంపెట్టుకొని, దానిద్వారా తమ కోర్కెలు సాధించుకోవాలనే దీక్ష ప్రతి కార్మికునిలో ప్రవేశించింది. 'మే' 26 వ తేదీని కార్మికులంతా సమావేశమయి, కార్యనిర్వాహకవర్గాన్ని ఎన్నుకున్నారు.తమ సంఘాన్ని అప్పుడే రిజిష్టరుకు కూడా పంపారు.

దీనితో యజమానులు రాయబారాలకు దిగారు, కూలిరేట్లలో 0-0-6లున్నూ, కరువుభత్యం రు. 2 నుండి 5 రూపాయలకు పెంచారు. తాత్కాలికంగా కార్మికులుపై పెంపుదలకు ఆమోదించారు. ఈ విజయాన్ని ఆధారం చేసుకొని తమ పరిస్థితులు బాగుపర్చుకోడానికి, తమ సంఘాన్ని బలపర్చుకోడానికి తీవ్రకృషి చేస్తున్నారు.

తగాదాలు

●

వస్తున్నై తగాదాలు—
జరుగుతున్నై కొట్లాటలు—
ఎండిన చెరువులక్రింద
పండించే రైతుబాధ
చూడకుండ శిస్తునడిగే
జమిందార్ల ప్రోద్బలాన;
అన్యాయం బిదియేమని
అడిగిన సహృదయులపై-

వస్తున్నై తగాదాలు—
జరుగుతున్నై కొట్లాటలు.
గింజలేక గిజగిజలై;
తిండికొరకు తికమకలై;
బాధనందు పేదప్రజలు
బ్రతికితేమి చస్తేమని
దొంగమార్కెట్లవలన,
దోచుకొనే షావుకార్ల సలహాపై
అన్యాయంబిది యేమని
అడిగిన సహృదయులపై

వస్తున్నై తగాదాలు—
జరుగుతున్నై కొట్లాటలు
అటు ఇటు తగవులు పెంచి;
లంచాలకు మంచమేసి;
భూస్వాముల కొత్తాసై;
తిండిదొంగల కండాయై,
నేరమెరుగని పేదప్రజలపై
మీరపీచని కేసుపెట్టి
పీల్చిపిప్పిని వదలుతున్న
మునసబు కరణాల వలన
అన్యాయంబిది యేమని
అడిగిన సహృదయులపై-

వస్తున్నై తగాదాలు—
జరుగుతున్నై కొట్లాటలు.
ప్రజాసేవను బాట విడువక;
పేరుకొరకై పాకులాడే
స్థానబలిమికి దేవులాడే.
బురఖా కాంగ్రెసువాదుల
బుద్ధిపూర్వక ప్రయత్నాన,
అన్యాయం బిదియేమని
అడిగిన సహృదయులపై-

వస్తున్నై తగాదాలు
జరుగుతున్నై కొట్లాటలు
పనిపాటను మాటనెరుగక;
దారిగొట్టి పూరబెరగి;
తప్పత్రాగి గంతులేసి;
మానవతులన్ మనసునొవ్వ
కూతలాడే బూతునోటి
పోగరుబోతుల ప్రోద్బలాన,
అన్యాయం బిదియేమని
అడిగిన సహృదయులపై-

వస్తున్నై తగాదాలు—
జరుగుతున్నై కొట్లాటలు.

— పీసా లక్ష్మణరావు

సిరియా లిబనాన్‌లలో సంక్షోభం ఇంకా సమసిపోలేదు. పంచరాజ్య సమావేశం జరపాలన్న డీగాల్ సూచనను చర్చిల్ తోసిపుచ్చాడు. చర్చిల్ తోకపెంబనే ట్రూమన్ కూడా నడచాడు. డీగాల్ సూచనను వీరెందుకు తోసిపుచ్చారు? అనే విషయాన్ని తెలిసికొనేందుకు, సిరియా లిబనాన్‌ల ప్రాముఖ్యత, వాటిపట్ల వివిధ దేశాల వైఖరి గమనించాలి.

సిరియా-లిబనాన్‌లు మధ్య ప్రాచ్యంలో నుంచి కీలక స్థానాలుగాఉన్నాయి. ఇండియా, ఆస్ట్రేలియా, దూరప్రాచ్య దేశాలకు పోయే ముఖ్యమార్గం-మధ్యధరాసముద్రం - ఇక్కడే వుంది. ఇంతేగాక సిరియా-లిబనాన్ లలో మంచి ఆదాయంవచ్చే నూనె గనులున్నాయి. అందుచేతనే బ్రిటిష్, ఫ్రెంచి, అమెరికన్ సామ్రాజ్య వాదులు ఈ ప్రాంతంపై ఎప్పుడూ కన్ను వేసి యుండడం. ముఖ్యంగా బ్రిటన్‌కు ఈ ప్రాంతంచాలా ప్రాముఖ్యమైంది. బ్రిటిషుసామ్రాజ్య మంతటికి (కెనడా, దక్షిణ ఆఫ్రికాలు తప్ప) సముద్ర, ఆకాశమార్గాలు ఇక్కడే ఉన్నాయి. బ్రిటను కున్న నూనె సంపదలో అధికభాగం ఇక్కడిదే.

ఈ ప్రాముఖ్యతను గుర్తించితే, ఆయా రాజ్యాలు ఈదేశాలపట్ల అవలంబించే వైఖరి మనకు సులభంగా గ్రాహ్యమౌతుంది.

ఫ్రాన్సు విదేశాంగనీతి

ఫ్రాన్సు యిదివరకటి ఫ్రాన్సు కాదు. యుద్ధానికి పూర్వంలా సామ్రాజ్య వాద ఫ్రాన్సుకాదు. ఫ్రెంచిప్రజలు నాజీ ముష్కరులతో పోరయుద్ధం గావించి, స్వతంత్రులయ్యారు. అయితే ప్రజల కోర్కెలను ప్రతిబింబించే ప్రభుత్వం ఇంకా ఏర్పడలేదు. సామ్రాజ్యవాదుల ప్రాబల్యం ఇంకా కొంచెం వున్నది. ప్రజల ఒత్తిడి ఫలితంగా డీగాల్ ప్రభుత్వం, దేశీయ విషయాలలో కొంచెం కదులుతూంది. కాని విదేశ విషయాలలో, ముఖ్యంగా వలస దేశాల విషయంలో అభివృద్ధి నిరోధకులదేపై చేయిగా ఉంది. అందుచేతనే మధ్యప్రాచ్యంలో సామ్రాజ్యహక్కులు కోరుతోంది. కీలక స్థానాలు, ప్రత్యేక వసతులూ కోరుతూంది.

దేశీయ వ్యవహారాలలో ఫ్రెంచిప్రభుత్వపు అభివృద్ధినిరోధక ధోరణిని ప్రజలు తీవ్రంగా ఎదుర్కొంటున్నారు. పెద్దపెద్ద బ్యాంకులను జాతీయ పరం చేయడానికి ప్రభుత్వం ఆలస్యం చేస్తోంది. కార్మికుల వేతనాలు తగ్గించ ప్రయత్నించింది. ద్రోహులైన పెద్దపెద్ద గుత్త వ్యాపారులనుశిక్షించుటలో వెనుకంజవేసింది. ఫ్రాన్సు అంతా ఫ్రాంకోపై చర్యతీసుకోవాలని కోరుతున్నా, అట్టి చర్య తీసుకోడానికి వెనుకంజ వేస్తోంది. కాని ఈ విషయాలలో ఫ్రెంచి ప్రజలేకముఖంగా ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చారు. అందుచే కొంతవరకు డీగాల్ ప్రభుత్వం కదిలింది. పెటాన్ విచారణ, లోవల్ ను స్పైన్ నుండి రప్పించడం, మొదలైనవి ఇందుకు ఉదాహరణలు.

దేశీయవ్యవహారాలలోబలహీనులుగాఉన్న ఫ్రెంచిసామ్రాజ్యవాదులు, వలసదేశాల సమస్యలను ముందుకు తీసుకువచ్చి ఫ్రెంచిప్రజల దృష్టిని మరల్చడానికి ప్రయత్నిస్తున్నారు. "మన సామ్రాజ్యం, మన వలసదేశాలు, మనం, పెద్ద దేశాలలో ఒకళ్ళం" ఇలాంటి వినాదాలతో ప్రజలదృష్టిని తక్షణం దేశంలో జరగవలసిన అవసరమవ్వలనుండి తప్పించ ప్రయత్నిస్తున్నారు. 2 నెలల క్రితం వీరు అల్జీర్సులో ఇలాంటి గందరగోళమేతెచ్చారు. బహుశా సిరియా - లిబనాన్‌లలో కూడ అదే ఆటఆడదామని ప్రయత్నించి యుండవచ్చు.

★ సిరియా - లిబనాన్‌లలో

చర్చిలుకు కావలసింది ప్రజల స్వాతంత్ర్యం కాదు

●

బ్రిటిష్ అభివృద్ధి నిరోధకులకు అవకాశం

కాని ఫ్రెంచి సామ్రాజ్యవాదుల కుట్రలు ఫలించలేదుగాని, దీనిమూలంగా బ్రిటిషు అభివృద్ధి నిరోధకులకు మంచి అవకాశం లభించింది. రెండేండ్ల క్రితం, సిరియా - లిబనాన్‌లలోని తమ మంత్రిద్వారా ఫ్రాంసు-సిరియా, లిబనాన్‌ల మధ్య తగవులు పెట్టారు బ్రిటిషు సామ్రాజ్య వాదులు. కాని అనాడవి ఫలించలేదు. బ్రిటిషుమంత్రి తిరిగి లండన్ ముఖం పట్టవలసి వచ్చింది. కాని ఈనాటి సంక్షోభాన్ని అవకాశంగా తీసుకొని బ్రిటిషు సామ్రాజ్యవాదులు ఆటలాడుతున్నారు.

బ్రిటిషు సామ్రాజ్య వాదుల ఆశయం ఏమిటి? ఫ్రెంచివారిపై సహజంగా అరబ్బులకుండే ద్వేషాన్ని పురస్కరించుకొని, పెంపొందుతున్న ఫ్రెంచి ప్రజా స్వామ్యాన్ని దెబ్బగొట్టడం. ఫ్రెంచి వలుకుబడిని తొలగించడం. (ఇందుకు ఫ్రెంచి సామ్రాజ్యవాదుల దర్యలుచక్కగా అవకాశంఇచ్చాయి) మధ్య ప్రాచ్యంలో ఎక్కడా ఫ్రెంచి, సోవియట్ దేశాలకు పలుకుబడిలేకుండాచేయడం.

అరబ్ ఫెడరేషన్

ఈనాడు అరబ్‌ఫెడరేషన్ వెనుకవున్నది కూడ బ్రిటిషు సామ్రాజ్యవాదులే. 1935 ఫెడరేషన్‌వల్ల మనకెంతస్వరాజ్యంవచ్చిందో, వీరికి అంతే. అరబ్ ఫెడరేషన్‌లో 7 రాజ్యాలున్నాయి. ఇందులో ఇరాక్, టాన్స్ జోర్డానియాలు పూర్తిగా బ్రిటన్ చేతిలో కీలుబొమ్మలు. నహాస్ పాషా మంత్రివర్గం పోయాక ఈజిప్టుకూడా అదేస్థితిలో వుంది. ఇక తక్కిన దేశాలలో పాలకవర్గమంతా భూస్వాములు, జమీందార్లు, రాజకుటుంబీకులు. వీరిలో బ్రిటిషు ఏజంట్లకు పలుకుబడి హెచ్చుగానే వుంది.

ఈ జమీందారీ యుగపు మనుష్యులంతా (సిరియా - లిబనాన్లలో సైతం) ప్రజా బలంవల్ల తమ స్వాతంత్ర్యం సంపాదించుకుందామని తలచడంలేదు. పైగా ప్రజాబలం అంటే వీరు భయపడతారు. ఏదో రకంగా విదేశాలతో మంతనాలాడి అధికారం సంపాదించుకోవాలని చూస్తారు. అందుచేత,సిరియా లిబనాన్‌లలో గనక బ్రిటన్ పెత్తనమే స్థిరమయితే, అరబ్ ఫెడరేషన్ అంతా బ్రిటిషు సామ్రాజ్యవాదుల పెత్తనంక్రింద ఉంటుంది. ఈనాడు స్వతంత్ర అరబ్బుప్రజల సమాఖ్యగా ఈ అరబ్‌ఫెడరేషన్ పెంపొందలేదు. బ్రిటిష్ సామ్రాజ్యవాదుల ఆదరాభిమానాలతో ఎన్నడూ అరబ్‌ప్రజలకు సుఖసంపదలబ్బవు. తమ స్వతంత్ర్యం కాపాడుకోవాలన్నా, తమ దేశాలు సంపదతో తులతూగాలన్నా, స్వతంత్ర ప్రజాస్వామ్య అరబ్బుదేశాలై కలవాలి గాని, ఏ పరాయి సామ్రాజ్యదేశాల ప్రోద్బలంతోనో కలవడంవల్ల లాభం లేదు.

సిరియా లిబనాన్‌లలో బ్రిటిషువాళ్ళు విద్రోహం రేకెత్తించుతున్నారని డీగాల్ స్పష్టంగా చెప్పాడు. బ్రిటిషువాళ్ళు, ఈ తగాదాలో జోక్యం కల్పించుకొనకముందే, అదివరకుఉన్న ఒడంబడికకు విరుద్ధంగా, మధ్య ప్రాచ్య సర్వసైన్యాధిపతి ఫ్రెంచిసైన్యాలకు రేషన్ సప్లయిలను అందకుండా జేశాడట. ఇంతేగాక కొన్ని దినాలవరకు ఫ్రెంచిసైనిక స్థానాలపై బ్రిటిషు సైనికుల తుపాకులు గురిపెట్టి కూర్చున్నారట. ఈ విషయాలన్నీ సిరియా లిబనాన్‌లలోని ఫ్రెంచిసైనిక ప్రతినిధి తెలియజేశాడు. 5 వేల ఫ్రెంచిసైన్యాల నుండి సిరియా - లిబనాన్‌లను "కాపాడటానికి" 6 లక్షల బ్రిటిష్‌సైన్యాలు వచ్చాయంటే అర్థమేమిటో మీరే ఊహించుకోవచ్చు.

చర్చిల్ ఎత్తు

బ్రిటిష్ సామ్రాజ్యవాదుల అపలురంగు చర్చిల్ ఉపన్యాసంలో బయటపడింది. బ్రిటన్ - ఫ్రాన్సు - అమెరికాల త్రైరాజ్య సమావేశం లండన్‌లో జరగాలని చర్చిల్ పట్టుబట్టాడు. డీగాల్ సూచించిన పంచరాజ్య సమావేశాన్ని తిరస్కరించాడు. దీని అర్థం ఏమిటి? ఫ్రెంచి పలుకుబడిని నాశనంచేసి తమ పెత్తనాన్ని సిరియా, లిబనాన్‌లలో స్థాపించుకోవాలనే చర్చిల్ ముఠా ఎత్తు. సోవియటుకు మధ్యప్రాచ్య వ్యవహారాలలో స్థానంలేకుండా చేయాలనికూడా మరొక ఆశ.

సోవియటు - చైనాలు లేకుండా, లండన్‌లో త్రైరాజ్య సమావేశం జరిపి, ఫ్రాంసు మెడలు విరచి, తమ పెత్తనాన్ని సిరియా - లిబనాన్‌లలో స్థిరంగా స్థాపించుకోవాలని బ్రిటిషు సామ్రాజ్యవాదుల దురాశ.

డీగాల్ మరొకవిషయం బయటపెట్టాడు. అమెరికా - బ్రిటన్‌లు ఈవిషయంలో తాము చేస్తున్న దేమిటో సోవియట్‌కు తెలియజేయనైనా తెలియజేయలేదట!

గత యుద్ధానంతరం తూర్పు యూరప్‌లో సోవియటుకు వ్యతిరేకంగా, తమ కీలుబొమ్మ రాజ్యాలను స్థాపించారు బ్రిటిష్ అభివృద్ధి నిరోధకులు. ఇప్పుడా ఆటకట్టింది. యూరప్‌లో ప్రజాస్వామ్య రాజ్యాలు తలలెత్తాయి. సోవియటు వ్యతిరేక కుట్రలకు ఇక మంచి అనువైన స్థలంమధ్యప్రాచ్యం అనుకున్నారు. అందుచేతనే ఈ తతంగమంతా. ఇకరవిధాల మధ్యప్రాచ్యం బ్రిటిష్ సామ్రాజ్యవాదులకు ఎంతో ప్రాముఖ్యమైన స్థలమే గాకుండా, ఈవిధంగా కూడ కీలకస్థానమైంది.

ఇక అమెరికా వైఖరి చూద్దాం. అమెరికాకుకూడ ఇక్కడనూనె సంపదలున్నాయి, తన ఆర్థిక బలాన్ని ఉపయోగించి వాటిని భద్రపరచుకొని, పెంపొందించుకోవాలని, అందుకు శాంతియుత పరిష్కారం అవసరమని, అమెరికా కోరుతోంది. కాని అదికూడా సోవియట్ వ్యతిరేక చర్యలలో బ్రిటన్‌నే అనుసరించుతోంది. మధ్యప్రాచ్యములో సోవియట్ వ్యతిరేక రాజ్యాలుండటం మంచిదని భావించుతూంది.

సోవియట్ వైఖరి

ఇట్టి పరిస్థితులలో సోవియట్ వైఖరి ఏమిటి? అరబ్బు రాజ్యాలన్నీ సోవియట్‌కి దక్షిణ సరిహద్దులలో ఉన్నాయి. ఈరాజ్యాలకు నిజమైన స్వాతంత్ర్యం, బలం ఉండేనే తనకూ - మధ్య ప్రాచ్య ప్రజలకూ క్షేమం. ఇచ్చట సామ్రాజ్యవాదుల కుట్రలు సాగితే అపాయం వుంటుంది. అందుచేతనే సంక్షోభం ప్రారంభం కాగానే "శాంతియుత పద్ధతులద్వారా" ఈ సమస్యనుపరిష్కరించాలని కోరింది. బ్రిటన్ - అమెరికా-ఫ్రాంస చైనా-సోవియట్‌లు సమావేశమై, చర్చించి ఈసమస్యను పరిష్కరించాలన్నది. సోవియట్ ఆశయం బ్రిటిషు - ఫ్రెంచి ప్రజల సామరస్యం చెడకూడదు. ఇది ముమ్ముందు యుద్ధాలకు కారణం కాగూడదు.వలసదేశాలు స్వతంత్రదేశాలు కావాలని మాలటోవ్ శాన్‌ఫ్రాన్సిస్కోలో పట్టుబట్టాడు. ఈకోరిక మధ్య ప్రాచ్యంలోని వలసదేశాలకు కూడా వర్తించుతుంది. అలా స్వతంత్రదేశాలుగా ఉన్ననాడే, అరబ్బు రాజ్యాలు బ్రిటన్-అమెరికా చేతులలో కీలుబొమ్మలు కాకుండా ఉంటాయి. సోవియట్ వ్యతిరేక కేంద్రాలు కాకుండా ఉంటాయి అందుచేతనే సిరియా - లిబనాన్‌లు స్వతంత్రమై బలిష్ఠ ప్రజాస్వామ్య దేశాలు కావాలని సోవియట్ కోరుతుంది. సిరియా-లిబనాన్‌ల స్వతంత్రం భంగం కానిరీతిని ఆంగ్లో - ఫ్రెంచి విభేదాలను పరిష్కరించడానికి సోవియటు ప్రయత్నించుచోంది.

ఫ్రాన్సులో ప్రజాస్వామ్య ప్రియులెవ్వరు సిరియా-లిబనాన్‌లను అణచి వేయమని డీగాల్‌ను కోరరు. పైగా డీగాల్ చర్యలను తీవ్రంగా ఆక్షేపించారు. అందుచేతనే డీగాల్ లొంగివచ్చి, పంచరాజ్య సమావేశానికి సిద్ధమయ్యాడు. అందులో బ్రిటిష్ కుట్రలను ఎదుర్కొనే ఉద్దేశ్యం కూడ ఉన్నది. అందుచేతనే చర్చిల్ ట్రూమన్‌లు ఈ కోర్కెను నిరాకరించారు.

ఫ్రెంచి దురాగతాల నుండి సిరియా-లిబనాన్‌లను బ్రిటిషు సామ్రాజ్యవాదులు రక్షిస్తారని భ్రమ పడరాదు. 1942 లో జపాను దక్షిణ ఆసియా ప్రజలకు "స్వాతంత్ర్యప్రదాత" గా పెద్ద నాటక మాడినట్లే ఈనాడు మధ్య ప్రాచ్యంలో బ్రిటను ఆడుతోంది. ఈవిషయం గమనించక పోవడం గుడ్డితనం. పెనంలోంచి దూకి, పొయ్యిలో పడే పరిస్థితిని తప్పించాలంటే, పంచరాజ్య సమావేశానికి ప్రపంచ ప్రజలంతా ఒత్తిడిచేయాలి. సామ్రాజ్యవాదుల కుట్రలను అరికట్టాలి. సిరియా - లిబనాన్ ప్రజలకు స్వతంత్రం, ప్రజాస్వామ్యం వచ్చే ట్లు చూడాలి.

'ప్రజాశక్తి'కి మా పారితోషికం

"ప్రజాశక్తి"ని దినపత్రికగా చేయడానికి విరాళాలీయవలసిందని కామ్రేడ్ సుందరయ్య ఇచ్చిన పిలుపు అనేక ప్రాంతాల్లో ఉత్సాహాన్ని రేకెత్తించింది. అనేకమంది తమ తమ తాహతునుబట్టి విరాళాలు పంపుతున్నారు. ఉదాహరణకు కొన్ని జాబులు క్రింద ప్రకటిస్తున్నాం.

నంద్యాలనుంచి శ్రీమతి ఐ. పద్మావతమ్మగారు యిలా రాస్తున్నారు:

"శ్రీయుత పి. సుందరయ్యాగారికి — సోదరా! మీరు "ప్రజాశక్తి" పత్రికను దినపత్రికగా మార్చుటకుగాను, విరాళాలకై కావించిన విజ్ఞప్తిని చదివితిని. ప్రజాఉద్యమములయొక్కయు, ముఖ్యంగా మహిళాసంఘములయొక్క, కృషికి "ప్రజాశక్తి" పత్రిక ఒనంగుచున్న ప్రోత్సాహమునకు అభినందించుచూ, అందులకు నా శక్తికితగినట్లుగా రు. 100 పంపుచున్నాను. అంగీకరించేది."

★

వినికొండ తాలూకా, చల్లపల్లి నుంచి కంతంనేని బలరామకృష్ణయ్యగారిలా రాస్తున్నారు:

"ప్రజాశక్తి" దినపత్రికకావాలనే అభిలాష చేత ఇక్కడి అభిమానులు రు. 5-8-0 లు కూడబెట్టి పంపించుటకు పూనుకొన్నారు. ఆ సొమ్ము పంపుచున్నాను."

★

తాటూరు బాలసంఘ ఆర్గనైజరు నాగళ్ళ జనార్దనరావు ఇలా రాస్తున్నాడు:

"కామ్రేడ్ సుందరయ్యగారికి— "ప్రజాశక్తి" దినపత్రిక అగుటకై నేను 27-5-45న రు. 2-8-0 డబ్బు ఇచ్చినాను. అది చూచి, బాలసంఘం సభ్యులు మేమిస్తామంటే మే మిస్తామని అన్నారు. దాదాపు రు. 20 వరకు వస్తాయి. 15 లేక 20 రోజులలోగా పంపగలను. 28-5-45."

★

రేపల్లె తాలూకాలో బేతపూడి గ్రామం వ్యవసాయకూలీ ఉద్యమానికి గుండెకాయ. 40 మంది కూలీయువకులు రైతుయువకుల సహకారంతో ఒక పంటకాలువను శ్రద్ధతో మరమ్మతుచేసి, వచ్చిన కూలిలో ఒకరోజు కూలి రు. 25 పార్టీనిధికి యిచ్చారు.

★

గుంటూరుజిల్లా గుంటుపల్లి గ్రామంలో 4-6-45న కామ్రేడ్ చెరుకూరి సుబ్బారావుకీ, ఆలూరి అయ్యన్నగారి పుత్రిక చిట్టెమ్మకూ, జరిగిన వివాహసందర్భంలో వరుడు "ప్రజాశక్తి" దినపత్రికనిధికి రు. 10 వాగ్దానం చేశాడు.

పల్నాడు తాలూకా కమ్యూనిస్టుపార్టీ జనరల్‌బాడీ సమావేశం మే 29, 30, 31 తేదీలలో రామాపురంలో జరిగింది. 17 మంది పార్టీసభ్యులు, 11 మంది సానుభూతిపరులు హాజరైనారు.

కామ్రేడ్ మాదల వీరభద్రరావు 'ప్రజాశక్తి' 5 లక్షలనిధికి విజ్ఞప్తిచేశారు. పల్నాడు తాలూకాలో పార్టీపని ప్రారంభించి రెండు సంవత్సరములు మాత్రమే పార్టీసభ్యులు చాలమంది శ్రమజీవులు రెక్కలాడితేనేగాని డొక్కలాడనివారు. ఎవరెంత యిద్దామా అని సభ్యులు తమ శక్తి అంచనా వేసుకుంటున్నారు. త్యాగశక్తిలో పురుషులకు తీసిపోతామా? అని కనుమూరు కమలమ్మగారు రు. 10 లు వాగ్దానం చేశారు. ఇక మొదలు పెట్టినవి వాగ్దానాలు. కామ్రేడ్ కోలా సుబ్బారెడ్డి నావి వందరూపాయలన్నారు. మిషన్ కుట్టి జీవించే అకాద్ సోదరులు రు. 50 అన్నారు. జిల్లాకమిటీ సభ్యుడు నిరాకరించినప్పటికీ వత్తిడిచేసి తమవంతును స్వీకరించమని చెప్పారు. ఈవిధంగా పార్టీ సభ్యుల త్యాగశక్తితో ముందుకొస్తుంటే సమావేశానికి వచ్చిన సానుభూతిపరుల త్యాగశక్తి అడుగు కలిపింది. వేముల శేషిరెడ్డి అనే రైతు, కమ్యూనిస్టు వర్కర్లు ఏ విధంగా గ్రామములో పని చేస్తున్నది చూచాడు. ప్రతికార్యక్రమంలో వారికండగా నిలిచేవాడు. పార్టీ సభ్యుల త్యాగశక్తివల్ల ఉత్సాహపూరితుడైనాడు. కొద్ది వ్యవధి అడిగి తను యివ్వగలిగింది సముద్రంలో నీటి బొట్టయినప్పటికీ, తను హృదయ పూర్వకంగా ఇస్తున్నదాన్ని స్వీకరించాలని చెపుతూ, రెండు రూపాయలు తెచ్చి కామ్రేడ్ వీరభద్రరావు చేతులో పెట్టాడు. మరొక ఉపాధ్యాయుడు (సానుభూతిపరుడు) వెంటనే పదిరూపాయలు వాగ్దానం చేశాడు. మొత్తం వాగ్దానాలు 410 రూపాయలు. సభ్యులందరు ప్రజాశ్రేయస్సు కొరకు పనిచేస్తున్న తమ పత్రికకు కనీసం రెండువేల రూపాయలనైనా వసూలు చేయవలెననే పట్టుదలతో తమ గ్రామాలకు వెళ్లారు.

పశ్చిమగోదావరిజిల్లాలో "ప్రజాశక్తి" దినపత్రికకు రు. 70,000 కోటాయిచ్చారు. 4-6-45 వ తేదీని ఏలూరు తాలూకా పార్టీ సభ్యుల సమావేశం ఏలూరులో జరిగింది. మొత్తం 68 మంది హాజరయారు. ఎవరెవరు ఎంత మొత్తం ఈయగలరో తెలుసుకోడానికి కామ్రేడ్ చంద్రరాజేశ్వరరావు "ప్రజాశక్తి" నిధికి విజ్ఞప్తిచేశాడు. కామ్రేడ్ గారపాటి రామశాస్త్రి రు.5000వాగ్దానంచేశాడు. కామ్రేడ్ కట్నేని సదానందం, తనవంతుగ రు.5000ఇస్తానన్నాడు. ఆంధ్రరాష్ట్రంలో రైతుఉద్యమాన్ని నిర్మించిన నాయకులలో ఒకరైన కీ॥ శే॥ కొమ్మారెడ్డి సత్యనారాయణమూర్తిగారి కుమారుడు రాజా రామమోహనరాయ్ రు. 2000 వాగ్దానం చేశారు. అన్నే వెంకటకృష్ణయ్యాగారి కుటుంబంలో అంతా పార్టీసభ్యులే. కాని, బీదవారు. అయినా, రు. 10 విరాళమిచ్చారు. ఆయన భార్య లక్ష్మీనరసమ్మగారు తనవద్ద మిగిలిన 4 మణుగుల తీసి "ప్రజాశక్తి"నిధికి అర్పించింది. ఈ విధంగా, మొత్తం రు 340 రొక్కం, రు.54లు వస్తురూపేణా, రు.12950 వాగ్దానాలు, వచ్చాయి. ప్రజలనుంచి మరో రు. 10 వేలు వసూలుచేయడానికి కోటాలు తీసుకున్నారు.

వైజ్ఞానిక ప్రదర్శనలు

(2 వ పేజీ తరువాయి)

కోరుతూతీర్మానించింది. గుంటూరుజిల్లా బోర్డు అధికారులు నిమ్నజాతి విద్యార్థుల స్కాలర్‌షిప్పు సౌకర్యాన్ని తగ్గిస్తూ గావించిన ఉత్తరవును ఉపసంహరించుకోవలసిందని కోరారు. ప్రాథమిక విద్యకు, వయోజనవిద్యకు ప్రభుత్వం ఇంకా యెక్కువ సొమ్ముఖర్చు చేయవలసిందని హెచ్చరించారు.

రాష్ట్ర విద్యార్థిసంఘానికి కుసుమ సుబ్బారావుగారిని అధ్యక్షులుగాను, లక్ష్మీబాయిని ఉపాధ్యక్షురాలు గాను, ఆనంద రావుగారిని ప్రధానకార్యదర్శిగాను పరిపూర్ణ, అన్నపూర్ణ గార్లను సహాయ కార్యదర్శినులుగాను, ఎం. వెంకటేశ్వర్లుగారిని కోశాధికారిగాను ఎన్నుకున్నారు.

వైజ్ఞానిక కార్యక్రమం

రాత్రి 10 గంటలకు వైజ్ఞానిక కార్యక్రమం ప్రారంభమైంది. అంతకు 2 వారాల నుంచి కామ్రేడ్ నంబూరి శ్రీనివాసరావు, దగ్గుమిల్లి సుబ్బారావు, బంటుమిల్లి నాగరత్నం (15 ఏండ్ల బాలిక) కొవ్వలి గ్రామానికి చుట్టుపట్లనుంచి వచ్చిన 40 మంది యువతీ యువకుల్ని, బాలబాలికల్ని ఈ కార్యక్రమంలో తరిఫీదు చేశారు. 3 వ తేదీరాత్రి వీరంతా తమ చాకచక్యాన్ని ప్రేక్షకుల యెదుట ప్రదర్శించారు. మొదట కామ్రేడ్ శ్రీనివాసరావు చెల్లెలు, పరిపూర్ణ అనే బాలిక జండానృత్యం చేసింది. వేదికమీద షెడ్యూల్డ్ జాతుల ఫెడరేషన్ జండా కట్టారు పక్కనే:

"అదుగో మనజండా
ఆ కాళవీధులలో
అలరారు చున్నది."

అంటూ ఒకరు పాటపాడుతుంటే, పరిపూర్ణ అభినయిస్తూ, భరతనాట్యం పక్కని, నృత్యం చేసింది. తరవాత, ఆదిమాంధ్రుల చరిత్ర, వారి దీనస్థితి వర్ణిస్తూ నాగరత్నం బుర్రకథ చెప్పింది. "పూర్వపు మాలవాడు" అనే సంభాషణలో అస్పృశ్యతను నిర్మూలించాలని ప్రబోధిస్తారు ఇద్దరు పకీర్లు.

"ఎంత కష్టించినా
హల్లాకెనాం
ముంత గంజికరవీకు
హల్లాకెనాం"

అని పాడుతూ నిమ్నజాతి ప్రజలకు ఐక్యతా ప్రబోధం చేస్తారు. తరవాత 15గురు బాలికలు:

"నిమ్నజాతులార రండి
నిదుర లేవండి
అంబ అబేద్కరు అంచు
రండిక రండీ"

అని "బతుకమ్మపాట" ధోరణిలో కలిసి పాడతారు.

బండారిగూడెం బాలసంఘంవారి భజన, పడవపాట, గొల్లసుద్దులు, త్రాగుబోతు,-వీటన్నిటిలోను అస్పృశ్యుల అవస్థలు చిత్రించబడ్డాయి. కలిసి తమహక్కులకోసం ఆందోళన చెయ్యాలని ప్రబోధిస్తాయి. "పాలేరు" అనే బుర్రకథలో రైతు-కూలీలమధ్య ఐక్యత ద్వారా భూస్వాముల నిరంకుశత్వాన్ని ఎలా రూపుమాపగలమో చూపుతాడుకవి. అభిరుచ "తుమ్మిదీల పరాభవం" అనే నాటికలో గొంతెమ్మ పండుగనాడు పది పదిహేను మంది చొప్పున యువతులు అగ్రజాతుల యిండ్లకు వెళ్ళి పాడుకుంటూ బియ్యం అడుక్కోడంవల్ల కొందరు ధనికవర్గానికి చెందిన యువకులు వారిని ఎలా అవమానించుతారో చూపుతాడు కవి. ఆ ఆచారం మానవలసిందని ఉద్బోధిస్తాడు.

ముగింపు

అన్నిటికంటే యీ వైజ్ఞానిక ప్రదర్శనలే ప్రేక్షకుల్ని బాగా ఉత్సాహభరితుల్ని చేశాయి. 3500 మంది తెల్లవారగట్ల 4 గం. వరకూ వీటిని చూచారు.

మరునాడు బెజవాడకు తిరిగి బయల్దేరే ముందు కొందరు నాయకుల్ని, యువకుల్ని, కలుసుకొన్నాను. నిమ్నజాతుల ఫెడరేషన్ పట్ల కమ్యూనిస్టుపార్టీ దృక్పథాన్ని తెలియజేస్తూ కామ్రేడ్ రణదివే రచించిన కరపత్రాన్ని కొందరు చదివారు. ఇంచు మించు విద్యార్థులంతా దాన్ని ప్రశంసించారు.

విద్యార్థి మహాసభకు అధ్యక్షత వహించిన కె. రాఘవులుగారు, కుసుమ సుబ్బారావుగారు కరపత్రం చాలా బాగుందన్నారు. అ. భా. నిమ్నజాతుల ఫెడరేషన్ యొక్క కార్యక్రమంలో సంపూర్ణస్వాతంత్ర్య సాధనముకూడా చేర్చడం మంచిదని వారంగీకరించారు. "అలా చేర్చడంవల్ల మీసంఘం యెడల కాంగ్రెసు వాదుల్లోవున్న అనుమానాలు తొలగుటకు అవకాశం వుంటుంది." అని ఈలివాడపల్లిగారితోను, ఎన్. శ్రీహరిగారితోను, వి. బాలకృష్ణగారి తోను, నక్కా చిన వెంకయ్యగారితోను, వాదించాను. అంబేద్కరు కాను స్వాతంత్ర్యానికి వ్యతిరేకి కానని చేసిన ప్రకటనను వారి జ్ఞప్తికితెచ్చాను. వారంతా నా వాదన విని, ఊరుకున్నారు. తమఅభిప్రాయం చెప్పడానికి సంశయించారు. ఒక యజమానికింద ఊడిగం చేస్తూ బాధలుపడే బానిస, కొత్తగా కళ్ళుతెరచి నప్పుడు తనయజమాని యొక్క నిరంకుశత్వమే చూస్తాడుగాని, విశాలప్రపంచమంతటా స్వాతంత్ర్య జ్వాలలు ఎలా రగులుతున్నాయో, వాటికి తనుకూడా దోహదం చేయడం ఎందుకవసరమో, గుర్తించ లేడుగదా! అందుకు కొంతకాలం పట్టకమానదను కొంటూ, బెజవాడకు తిరిగి బయల్దేరాను.

సవరణలు

ఈ సంచికలో 8 వ పేజీలో "బెజవాడ తోళ్ళకార్మికుల విజయం" అనేవ్యాసం ఉంది. అందులో క్రింద సవరణలు చేసుకొని వ్యాసం చదువవలసిందిగా పాఠకుల్ని కోరుతున్నాం:

1. సున్నంలో వేసిన తోళ్ళలో 150 పైకి తీసి బొచ్చుతీస్తే, కూలి 0-4-9; 0-4-0 కాదు. దాని తరవాత పంక్తిని వదలివేయాలి.

2. పీస్‌రేటు పద్ధతిని ప్రతి కార్మికుడు సగటున రోజుకు 0-6-0 కు మించి వేయలేడు; 3-6-0 కాదు.

"తగాదాలు" అనే పాటలో ప్రజాసేవను చాటవిడువక, అనేపంక్తి ఒకటుంది. 'విడువక' అనేమాటకు బదులు 'నడువక' అని చదువుకోవాలి.

"ప్రజాశక్తి" నిధికి కర్నూలుజిల్లా వంతు

జిల్లారైతుసంఘంస్కూలు జరుగుతూంది. 40 మంది విద్యార్థులకు రైతుసమస్యల గురించి తర్ఫీదు ఇస్తున్నారు. స్కూలుకు మామిడి తోటనిచ్చి, యితరవిధాలుగాసహాయపడుతున్న కొడిదేడు గ్రామరైతులు, పెద్దలు యువకులు—రోజూ స్కూలుకువచ్చి పాఠాలు వినేవారు. రైతుసంఘం కమ్యూనిస్టుపార్టీ తమ బిడ్డలకు ప్రజాసేవలో యేవిధంగాతర్ఫీదు ఇస్తున్నదీ చూచి, ఆశ్చర్యపడ్డారు. గ్రామంలో బహిరంగ సమావేశం పెట్ట వలయునని, పట్టుపట్టినారు. 20-5-45న శ్రీ ముక్కామల నాగభూషణంగారి అధ్యక్షతను బహిరంగ సమావేశం జరిగింది. ముక్కామల గారు రైతుల నెదుర్కొంటున్న సమస్యలగురించి, వేరుశనగ, జొన్న ధరల గురించి, క్రొత్త ప్రాజెక్టులగురించి, జిల్లా రాష్ట్ర రైతు సంఘాల కృషిని గురించి, ఉపన్యసించారు. దేశంలో వున్న రాజకీయ పరిస్థితులు వివరించారు. "ప్రజాశక్తి" వారపత్రిక ప్రజలకు చేస్తున్న సేవను గురించి చెప్పి ఆంధ్రదేశంలోని వివిధ ప్రజా ఉద్యమాలు ముందుకు వెళ్ళాలంటే "ప్రజాశక్తి"ని దినపత్రికగా మార్చవలయునని, అందులకు ఆంధ్రపార్టీ 5 లక్షల రూపాయలు నిధిని ప్రోగుచేయుటకు చేస్తున్న కృషిని గురించి చెప్పి ఆనిధికి, తోడ్పడమన్నారు.

ఈసభవల్ల రైతుల్లో ఎంతో ఉత్సాహం కలిగింది. తమ బాధ్యతను గుర్తించారు. రు. 200 గ్రామంలో చందాలు వసూలుచేశారు. మరునాడు స్కూలు విద్యార్థుల గొప్ప విందు చేశారు. కామ్రేడ్ కోనేరు రాజగోపాలరావు గారు విందుకు కృతజ్ఞత తెలియజేస్తూ పార్టీ ప్రజలకు చేస్తున్న, కృషిని వివరించారు. రాత్రి ముక్కామలగారి అధ్యక్షతను తిరిగి బహిరంగ సమావేశం జరిగింది. గ్రామస్థులు "ప్రజాశక్తి" పండుగుకుగాను రు. 100 యిచ్చారు. జిల్లా పార్టీ తరపున కామ్రేడ్ పుల్లారెడ్డి దాన్ని స్వీకరిస్తూ, జిల్లాలో పార్టీ చేస్తున్న కృషిని ఉదహరించారు. శ్రీ స్వామిరెడ్డిగారు రైతుసంఘాల కార్యక్రమాన్ని వివరించారు. ముక్కామలగారు దేశంలో ప్రస్తుతమున్న రాజకీయ పరిస్థితుల్ని విశదీంకరిస్తూ, సంఘ విచ్ఛిన్నకుల అసలు రంగును బట్టబయలు చేశారు. కాంగ్రెసు - కమ్యూనిస్టు పార్టీల మధ్య ఐక్యతను నిర్మించుట ప్రజల బాధ్యత అని తెలియజేశారు. "స్వతంత్ర భారత్‌కు జై" "రైతుసంఘాలకు జై" "కమ్యూనిస్టుపార్టీకి జై" అనే నినాదాలతో సభ ముగిసింది.

24-5-45న పాణ్యంమండి బహిరంగ బుర్రకథ పెట్టవలయునని పిలుపు వచ్చింది. 24-5-45 రాత్రి స్థానిక కాంగ్రెసువాది శ్రీ యల్లారెడ్డిగారి అధ్యక్షతనుపాణ్యంలో బహిరంగ సమావేశం జరిగింది. కామ్రేడ్ పుల్లారెడ్డి జాతీయ అంతర్జాతీయ పరిస్థితులు తెలుపుతూ రైతుసంఘాల కృషి వివరించారు. తర్వాత బుర్రకథచెప్పబడింది. మరుసటిరోజు "ప్రజాశక్తి" పండుకు విజ్ఞప్తి చేస్తే రు 200 వాగ్దానాలు వచ్చాయి.

దీనితో స్కూలుకువచ్చిన ప్రచారకులు, నాయకులు పార్టీ ఏవిధంగా ప్రజల ఆదరాన్ని సంపాదిస్తుందో చూచారు. "ప్రజాశక్తి"ని దినపత్రికగా మార్చుటకు తమవంతు బాధ్యత నెరవేర్చ వలయునని గుర్తించారు. స్కూలు ముగింపు రోజు 25-5-45 న కామ్రేడ్ రాజగోపాలరావు "ప్రజాశక్తి" పండుకు అప్పీలు చేసాడు. విద్యార్థులందరూ, పార్టీబలంగా ఉన్న నందికొట్కూరుకామ్రేడ్సు వైపు చూస్తున్నారు. 2 నెలల క్రిందటనేజిల్లా రైతుమహాసభకు రు. 5000లు ఆ తాలూకాలో వసూలుచేశారు. ఇంకేమి వసూలుచేస్తారనే సంశయం కొందరిలో ఉంది. కామ్రేడ్ సుదర్శనవర్మ (పెలుగోడు) నావంతు రు. 200 లు అన్నాడు. దీనితో అందరూ ఉత్సాహపడినారు. చెరుకుచెర్ల రామచంద్రయ్యగారు రు. 150 లు అన్నారు. బనివిరెడ్డిగారు రు. 75 లు వాగ్దానమిచ్చారు. వర్ద పుల్లయ్య రు. 25 లు, వి. రామమూర్తి రు. 25 లు, వాగ్దానమిచ్చారు. కూలి చేసుకొని జీవించే కామ్రేడ్ ఖాసిం నావంతు రు. 25 లు అనేసరికి అందరికీ ఆశ్చర్యమేసింది. తాలూకా మొత్తం మీదరు. 1500 లుకోటా తీసుకున్నారు. తరువాత కంభం తాలూకావంతు వచ్చింది. బీద తాలూకాఅయినప్పటికిన్ని, కామ్రేడ్సుపట్టుదల చూపారు. కామ్రేడ్ కాయన్నతనశక్తికిమించి రు. 100 పండు వాగ్దానమిచ్చారు. తాలూకా మొత్తం పైన రు. 600 కోటా తీసుకున్నారు. కొత్తగాసంబంధం కలిగిన నంద్యాల తాలూకాకు రు. 1000 లు కోటా తీసుకోవటం చెప్పుకోదగ్గవిషయం. కర్నూలు రు. 600 లు, పత్తికొండరు. 500లు, కోయిలకుంట్ల రు.200 కోటాలు తీసుకున్నారు. జిల్లాకమిటీసభ్యులు రు.1000 వాగ్దానాలు ఇచ్చారు. ఈ విధంగా జిల్లాలో మొత్తం 6000 వసూలు చేయుటకు కోటాలు తీసుకున్నారు. కామ్రేడ్సు అంతా తమశక్తికి మించికోటాలుతీసుకొంటున్నారంటే, "ప్రజాశక్తి" దినపత్రికపట్ల వర్కర్సులో కల్గుతున్న ఉత్సాహానికి ఇదొక నిదర్శనం.

ఆత్మకూరులో దొంగమార్కెట్టును ప్రోత్సహించే దెవరు?

ఇప్పటికి 2 మాసాలనుండి ఆత్మకూరు తాలూకాలో యించుమించు అన్ని ప్రదేశాల్లో ప్రజలు బట్టలకరువు యమయాతనలు అనుభవిస్తున్నారు. దీనికి కారణం వ్యాపారస్తులకు రావలసిన కోటాల ప్రకారం గుడ్డ రాకపోవడం, వచ్చిన కొదిపాటి గుడ్డనయినా వ్యాపారస్తులు న్యాయమైన ధరలకు ప్రజల కమ్మకపోవడం. ఈ విషయంలో బాధ్యతగల ఆఫీసర్లు కలుగచేసు కొనకపోగా, దొంగవ్యాపారాన్ని దొడ్డిదారిన సాగించుటకు అన్నివిధాలతోడ్పడుతున్నారు.

పరిటాల వెంకటసుబ్బయ్య గుడ్డల అమ్మకంలో బహిరంగంగా దొంగవ్యాపారం చేస్తున్నాడు. బిల్లులు అడిగితే నిరాకరించడం, వత్తిడిచేస్తే సీలింగురేటుప్రకారం బిల్లు యిచ్చి బిల్లుకు మించినడబ్బు తీసుకోవడం, గట్టిగామాట్లాడితే నేను అమ్మను పొమ్మనడం-మామూలు.

పోయినసంవత్సరం ఇనుము విషయంలో ఈయన చేస్తూవచ్చిన దగాను యెదిరించి ప్రజలు బ్రహ్మాండమయిన ఆందోళన సాగించారు. అధికార్లతో లెక్కలేనన్ని సంప్రదింపులు సాగించారు. బహిరంగంగా జరుగుతున్న దొంగవ్యాపారాన్ని పట్టి చూపించారు. యింత జరిగినా, అధికార్లు ఈవ్యాపారిపై కఠిన చర్య తీసుకోలేదు. అతని సంగతి లోకానికి విదితమయింది. అయినా, తిరిగి గుడ్డల లైసెన్సు అతని కివ్వటం యెందుకు జరిగింది?

ఆత్మకూరులో సివిల్ సప్లయిలగుమస్తా యద్దనపూడి శ్రీరామశర్మ. ఈయన చరిత్ర వింటే, యెందుకు ఆత్మకూరులో దొంగవ్యాపారం సాగుతుందో అర్థమవుతుంది. ఈయనకు రూ. 60 జీతం. రూ 18½లు అలవెన్సు. ఇప్పుడు 5 వేల రూపాయలకు పైగా సొమ్ము వడ్డీకిచ్చివున్నాడని తెలుస్తూంది. గ్రామాలకు కిరసనాయిలు కోటాలు సరిగా యివ్వడు. లంచంలేనిదే పని చేయటమనేది ఆయన హోదాకు తక్కువగా భావిస్తాడు. ఆత్మకూరు కో-ఆపరేటివ్‌స్టోర్సుకు లైసెన్సు యివ్వటంలోనూ, అమ్మకానికి ఉత్తరువు యివ్వటంలోనూ, స్టోరువారిని యేడిపించివేశాడు. హోల్‌సేల్ అమ్మకానికి స్టోరుఒకసారి 40 బస్తాల గోధుమలు తెప్పించింది. కానియింతవరకు రీటెయిలు వ్యాపారస్తుల్ని నియమించి, వచ్చినస్టాకును అమ్ముటకు అవకాశం ఇవ్వలేదు. గోధుమలు పుచ్చిపోతున్నాయి. వేలరూపాయల నష్టంవచ్చేలా వుంది. ఇలాగే చక్కెరసంగతి కూడా. ప్రతినెలా 20 బస్తాలు చక్కెర స్టోరుకు వస్తుంది. వ్యాపారస్తులు 1, 2 బస్తాలుకన్నా యెక్కువ అమ్మలేదు. అయినా స్టోరుకోటా తగ్గించి, వ్యాపారులకోటాలు పెంచాడు. ఫలితం, చక్కెరలో బ్లాకుమార్కెట్టు యెక్కువయింది. స్టోరుకు కిరాసిన్ లైసెన్సు యివ్వ నిరాకరిస్తూ దొంగవ్యాపారిని కిరాసిన్ పంచమన్నాడు. ఇలా లెక్కకుమించిన పీడన పనులు యీనాడు శర్మగారు చేస్తున్నారు. ఆయన మద్దతుతో ప్రసిద్ధ దొంగవ్యాపారి పరిటాల వెంకటసుబ్బయ్య బహిరంగంగా దొంగవ్యాపారం చేయగలుగుతున్నాడు.

ప్రజలకు గుడ్డ దొరకక, అధికధరలకు దొంగమార్కెట్టులో కొనుక్కోలేక, విపరీత బాధలకు గురిఅవుతున్నారు. ఈ పరిస్థితుల్లో ప్రజల బాధలు తీర్చటం ఎలాగు? వ్యాపారస్తులకు యివ్వవలసిన కోటాస్టాకులు తక్షణం విడుదలచేయాలి. పరిటాల వెంకటసుబ్బయ్య కొట్టులోఉన్న స్టాకును తక్షణం బయట వేయించి, సీలింగురేట్లకు ప్రజల కమ్మించాలి. ఆఫీసర్లు సివిల్ సప్లయిస్ క్లర్కు శర్మను తక్షణం ఆత్మకూరినుండి మార్చివేయాలి.

పైపనులు సాధించాలి అంటే ప్రజలు నిర్మొగమాటంగా ఐక్యతతో ఉద్యోగుల చర్యలను బహిరంగపరుస్తూ వ్యాపారి పక్రమ ధరల కమ్మనని ఆందోళన సాగించాలి.

—జి. సి. కొండయ్య

అనంతపురం జిల్లా రైతుమహాసభ

(12వ పేజీ తరువాయి)పంటలు కొనే దిక్కులేకఎక్కడి సరుకక్కడే నిలవవుండే పరిస్థితి తొలగిపోతుంది. ఆహారసమస్యా పరిష్కారానికి తోడ్పడుతుంది. దీనితోపాటు ప్రజలకు యింత అన్నం దొరికేలా రైతాంగం కృషి చేయాలి. రైతులంతా రైతుసంఘాలలో చేరి ఉద్యమాన్ని బలపరచవలసిందిగా విజ్ఞప్తి జేస్తున్నాను" అంటూ ముగించారు.

కామ్రేడ్ వావిలాల ఈ యుద్ధంలో విజయమందినది ప్రజలేనని వివరించినప్పుడు సభలోనున్న కాంగ్రెసువాదులు బాగా అర్థం చేసుకున్నారు. "ఇప్పుడు నిజపరిస్థితి తెలిసింది. ప్రజలు అనేకచోట్ల విజయాలు సాధిస్తున్నారు. మనకుకూడా స్వాతంత్ర్యం త్వరలోనే వస్తుందనీ, సామ్రాజ్యవాదం నశించిపోతుందనీ మాకు నమ్మకం కలిగింది" అంటూ కొంతమంది కాంగ్రెసువాదులు నాతో ఉత్సాహంగా అన్నారు.

ఉపన్యాసాలేగాదు రైతుల నుత్సాహపరచింది. సోవియట్ చిత్రప్రదర్శనాలుకూడా బాగా పనిచేశాయి. 3000 మంది ఈప్రదర్శనలు చూశారు. ట్రాక్టర్లు, కంబైన్లు, చూస్తూ రైతులు; ఆరోగ్యకేంద్రాలూ, ఆసుపత్రులూ శిశుపోషణ కేంద్రాలూ చూస్తూ స్త్రీలు- "మనకలాంటి భాగ్యం ఎన్నడు కలుగుతుంది?" అని తరచు ప్రశ్నించేవారు. దీనితోపాటు "కష్టజీవి" బుర్రకథ, ఇతరపాటలుకూడా ప్రజల నుత్సాహపరిచాయి.

పత్తిని నియమిత ధరకు ప్రభుత్వమే కొనాలనీ, వేరుశనగనుకూడా ప్రభుత్వమే కొనాలనీ, పెన్నారు ప్రాజెక్టులను నిర్మించాలనీ, చెరువుల మరమ్మతులూ ఇతర జలాధారముల నిర్మాణం కావాలనీ, ధర్మవరం కళ్యాణదుర్గ తాలూకాలలో కరువునివారణకై ప్రభుత్వం పూనుకోవాలనీ, అక్కడ శిస్తు రెమిషన్లు యివ్వాలనీ, ఎరువులు కొరకునూ విత్తనాలు విరివిగా సప్లయి చేయాలనీ, కామ్రేడ్ సుందరయ్యను విడుదల చేయాలనీ, యింకా అనేక సమస్యలపైన తీర్మానములు ఏకగ్రీవంగా సభలో ఆమోదింప బడ్డాయి.

మూడేండ్లక్రితం నామమాత్రంగాఉన్న రైతుసంఘం నేడొక ప్రజాసంస్థగా మారింది

అనంతపురం జిల్లా రైతు మహాసభ

అనంతపురం జిల్లా ఆర్థికంగా చాలా వెనుకబడిన జిల్లా. తరచు కరువుకాటకాలకు గురియవుతూ ఉంటుంది. రాయల పరిపాలన కాలంలో రత్నాలసీమగా పేరొందిన రాయలసీమలో ప్రధానమైన భాగమే అయినప్పటికి, ఈనాడు జిల్లా ప్రజలకు పట్టెడు మెతుకులు కూడా కరువయి పోయినవి. విజయనగర రాజుల పరిపాలన కాలంలో నిర్మింపబడిన చెరువులే ఈనాటికి, "తరి" (పల్లం) సేద్యానికి ఆధారంగా వున్నాయి. ఎగువ పెన్నారు ప్రాజెక్టు, దిగువ పెన్నారు ప్రాజెక్టులు-వినా కినీ నదిపైన - కడితే జిల్లాలో "తరి"సాగును ఎక్కువ చేయడానికి, కరువు కాటకాల నరికట్టడానికి, ఎంతో ఉపకరిస్తాయి. కాని, రైతులు, రైతుసంఘాలు ఎంతగా ఆందోళన చేసినా ప్రభుత్వం లాభసాటి జలాధారాలు కావనే సాకుతో త్రోసివేస్తోంది. తరచు సంభవించే కరువుల నరికట్టడానికి ప్రభుత్వం కరువు క్యాంపులుపెట్టి రాళ్ళు పగులగొట్టిస్తుందేగాని జలాధారాలను నిర్మించడానికి పని చేయించడంలేదు. అంతేగాకుండా, "ఖుష్కి" (మెరక) భూములలో పండే వేరుశనగ, ప్రత్తి, మున్నగు పంటలకు సరియైన ధరలు రావాలంటే, రాయలసీమలో పరిశ్రమలు నెలకొల్పాలి. వాటికి కావలసిన ముడిసరుకులు, ఇనుము వగైరా ఖనిజ సంపత్తి రాయలసీమలో కొల్లలుగావుంది. కాని సామ్రాజ్యవాద ఆర్థిక విధానం వాటినన్నిటినీ అరికడుతోంది. అందుచేత ఈనాడు రాయలసీమలో ప్రత్తి, వేరుశనగ కొనే దిక్కులేక రైతులు నానా అగచాట్లు పడుతున్నారు. ఈ అగచాట్లలో అనంతపురం జిల్లాది అగ్రతాంబూలం. రెడ్డి (మునిసిఫ్), కరణాల పీడన రైతులరక్తాన్ని పీల్చి పిప్పిచేస్తోంది. చీటికీకోడు దొంగ మార్కెట్టు విపరీతంగా సాగుతోంది. జీవితావసర వస్తువులు కొనడానికి ప్రజలకుడబ్బు లేదు. ఉన్నా వస్తువులు దొరకవు. బండి కమ్మలు (పట్టాలు) మున్నగు వ్యవసాయ పనిముట్లులేక వ్యవసాయం మూలపడుతోంది.

రైతు సంఘాల కృషి

ఈ యిక్కట్లను తొలగించి రైతుల్ని పైకి తీసుక రావడానికి రైతు సంఘాలేర్పడి దండిగా పనిచేయసాగాయి. మూడు సంవత్సరాలక్రితం అనంతపురం జిల్లాలో రైతు ఉద్యమం నామమాత్రంగానేవుండేది. కాని ఈనాడు బలమైన ప్రజా వుద్యమంగా తయారయింది. ఎందువల్ల ? 1943 వ సంవత్సరంలో వచ్చిన కరువును అరికట్టడానికి కరువునివారణ కమిటీల నేర్పరచి పేదజనానికి గుడ్డలూ, దుడ్డూ (డబ్బు) పంచింది రైతు సంఘం. కరువు క్యాంపులవద్ద వాలంటీర్లను పెట్టి ప్రజలకు సక్రమమైనకూలీ, గింజలూ దొరికేలా పాటు బడింది. కరువు ప్రాంతాలలో శిస్తు రెమిషన్ల కొరకు తీవ్ర ఆందోళన చేసి సాధించింది. పెన్నారు ప్రాజెక్టుల కొరకు తీవ్రమైన కృషి చేస్తోంది. దొంగ మార్కెట్టుల నరికట్టడానికి రెడ్డి, కరణాలు, పోలీసుల జులుంనుండి ప్రజలను కాపాడడానికి ఎన్నికష్టనష్టాలకైనా ఓర్చి పని చేస్తున్నారు రైతువర్కర్లు. ఈవిధంగా కృషిచేస్తూ రైతుల-కూలీల పాలిట కల్పతరువుగా వృద్ధిపొందుతోంది జిల్లారైతుసంఘం.

మహాసభకు సప్లయిలు

దినదిన ప్రవర్ధమానంగా పెంపొందుతోన్న ఉద్యమాన్ని యింకా ఉన్నతస్థాయికి తీసుకుపోవడానికే బుక్కపట్నంలో మే నెల 26వ తేదీన జిల్లారైతుమహాసభ జరిగింది. సభను దిగ్విజయంగా జరుపడానికి బుక్కపట్నపు రైతులు, కూలీలు చేసినసహాయం అపారం. మహాసభ ప్రయత్నాలు జోరుగా సాగించ పూనుకోగానే కామ్రేడ్ దాసప్ప వగైరా ఎనమండుగురు బుక్కపట్నం కామ్రేడ్స్ అరెస్టు చేయబడ్డారు. అయినా, జంకలేదు పేద రైతులు కూలీలు. "మనిషి కొకరాయి తెస్తే వంకకొకవారధికట్టొచ్చు! కానీయం"డన్నారు. దినం 8 మైళ్లు నడిచివెళ్ళి పందిరికి కావలసిన గుంజలు,వాసం వగయిరా కలపంతాఉచితంగా తెచ్చారు. లింగారెడ్డి పల్లె,బుచ్చయ్యగారిపల్లె రైతులు 40 బండ్ల ఈతాకు పందిళ్ళ కొరకు ఉచితంగా కొట్టి తోలారు. బుక్కపట్నం దాని చుట్టుప్రక్కల పల్లెల రైతులు మహాసభకు కావలసిన బియ్యం, పప్పు, మజ్జిగ వగయిరా సరుకులన్నీ ఉచితంగాసప్లయిచేసారు. అంతేగాకుండా, ఇంకా రు. 800-0-0 ల దుడ్డు కూడా వసూలైంది. ప్రచారకదళాలు బయలు దేరి, పెనుగొండ తాలూకాలో 80 పల్లెల లోనూ, ఇతరతాలూకాలలో 52 పల్లెలలోనూ తీవ్రంగా ప్రచారం చేశాయి. బుక్కపట్నం రైతులు శిలార్ సాహెబు, ఖాసీం పీరాగార్లు నడుముకట్టి నిలబడ్డారు. తాలూకా కాంగ్రెసు నాయకులలో ఒకరైన శ్రీ నంజిరెడ్డి (ఆహ్వాన సంఘాధ్యక్షులు) శ్రీ ఆదినారాయణ రెడ్డి బి. ఏ. (ఆహ్వాన సంఘ కార్యదర్శి), గార్లు సభను దిగ్విజయం చేయాలని పట్టుబట్టారు. ఇంతలోనే ఒకశుభవార్త, అరెస్టయిన 8 మంది కామ్రేడ్సు జామీను మీద విడుదలయ్యారు. వాతావరణ మంతా ఉత్సాహంతో నిండి పోయింది.

ఈ ఏర్పాట్లన్నీ చూచి, ఓర్వలేని పిశాచి వర్షం 25 రాత్రి 11 గంటలకు గాలిని తోడు తెచ్చుకొని పందిళ్ళను పడద్రోసింది. వెంటనే వాలంటీర్లు తెల్లవారేసరికల్లా కామ్రేడ్ సదాశివన్ నాయకత్వానమామూలుగానిలబెట్టేశారు.

ఊరేగింపు

కార్యక్రమంలో ఉదయం 9 గంటలకు ఊరేగింపు జరగాలి. కాని రాత్రి వర్షం కురిసింది. పెనుగొండలో గొప్ప ఉరుసు ఉత్సవం జరుగుతోంది పోలీసులు సభకు వెళ్ళవద్దని రైతులను బెదరించసాగారు. ప్రజలు విరివిగా రారనే అనుమానం తోచిందిమాకు. కామ్రేడ్ రాజశేఖర్ "ఫరవాలేదు! మాప్రజలు ఎన్నిటికైనా తట్టుకోగలరు. ఊరేగింపు, సభ కూడా జయప్రదమవుతాయ"ని జవాబిచ్చారు. ఊరేగింపు అనుకున్న వేళకు ప్రారంభమయింది. అమృతమహల్ జాతిఎద్దులను బాగా అలంకరించి 20 జతలను పూన్చిన బండిపై నాయకుల్ని ఊరేగించారు. వెయ్యిమంది ఊరేగింపులో బారులుతీరినడిచారు. బుక్కపట్న పుర వీధులలోఊరేగింపు వెళుతోంటే, స్త్రీ-పురుషులు యావన్మందీ వాకిళ్ళలో నిలచి పూల సేనలు చల్లుతూ, నాయకుల్ని దండలతో నింపివేస్తోంటే, నేత్రపర్వంగావుంది. ఒక కాంగ్రెసువాది మురిసిపోతూ, నాతో యిలా అన్నారు! "ఇంతచక్కగానూ, గొప్పగానూ ఊరేగింపు మాజిల్లాలో ఇదివరకు జరుగనేలేదు. రైతులు బారులుతీరి క్రమశిక్షణతో ఊరేగింపులో నడువడమంటే, నూతనచైతన్య మెలాఉబికివస్తోందో తెలుస్తోంది."

సాయంత్రం 5 గంటలకు మహాసభ ప్రారంభమైంది. గతరాత్రి వర్షంకురిసింది. ఒకవైపున పెనుగొండలో బ్రహ్మాండమైన ఉరుసు ఉత్సవం జరుగుతున్నా, రైళ్ళకు టిక్కెట్లు యివ్వకపోయినా, పోలీసులు బెదిరించినా, "అదురు బెదురూ లేక అడ్డేదియును లేక" అని పాడుకుంటూ బండ్లమీదా, కాలి నడకనూ వచ్చి చేరారు 6 వేలమంది రైతులు. సిద్దరాంపురం స్త్రీలు "ఎన్నాళ్ళీగతి బానిస బ్రతుకూ, యోచనచేయర దేలా ?" అనీ, "స్త్రీలసంఘము లేవవలెనమ్మా"అనీ, పాటలు పాడుకుంటూ వచ్చారు.

కృష్ణాజిల్లా వైజ్ఞానికదళం "ఎగురవేయ్ భారత భువిపై అరుణపతాకం" అని పాడుతూండగా, కామ్రేడ్ రాటకొండ నరసింహారెడ్డిగారు ఎర్రజెండా నెగురవేశారు. ఎర్రజెండాక్రింద రైతుసంఘాలు సాధించిన విజయాలనూ చెప్పి, "ఈజెండా కాంగ్రెసు జెండాకుగాని, ముస్లిం లీగుజెండాకుగాని వ్యతిరేకం కాదు. ఎర్రజెండా కాంగ్రెసుజెండాకు వ్యతిరేకమనడం శుద్ధఅబద్ధం. స్వార్థపరులు బుద్ధిపూర్వకంగా చెప్పేమాటలు అవి. పది సంవత్సరాల కాలంనుండీ ఎర్రజెండాను గౌరవించాలని చెబుతూ వచ్చిన రంగా ఈనాడు ఈజెండా పనికిరాదంటున్నాడు. ఆస్వార్థపరుని మోసాలకు బలిగాకుండా రైతాంగం ఈ ఎర్రజెండా క్రింద ఏకమవ్వాలి." అంటూ ముగించారు.

కాంగ్రెసు - కమ్యూనిస్టు ఐక్యత అవసరం

ఆహ్వాన సంఘాధ్యక్షులు శ్రీ నంజిరెడ్డిగారు సభికులకు, నాయకులకు స్వాగతం యిచ్చారు. జిల్లా రైతుల కష్టాలను వర్ణించి, వాటిని పోగొట్టుకోడానికై రైతులంతా ఐక్యముగా కృషిచేయాలనీ, కాంగ్రెసువాదులూ కమ్యూనిస్టులూ కలిసిపనిచేయాలని,చెప్పారు. పోటీసంఘాలను తీవ్రంగా నిరసించారు.

తరువాత కామ్రేడ్ వావిలాల గోపాలకృష్ణయ్య మహాసభను ప్రారంభించారు. నేటి రాజకీయ పరిస్థితులను క్షుణ్ణంగా సమీక్షజేస్తూ గోపాలకృష్ణయ్యగారిలా అన్నారు:

"నాజీజం నాశనమైంది. యూరప్ ప్రజలు ఐక్యమై ప్రజా రాజ్యాలు స్థాపించు కుంటున్నారు. నాజీ వ్యతిరేక పోరాటాలలో తాము గావించిన త్యాగాలకు ప్రతిఫలంగా వివిధ దేశాల ప్రజలు అధికారాలను తమ చేతులలోకి తీసుకుంటున్నారు. మన దేశంలో కాంగ్రెసువాదులు ఈ పరిస్థితిని గుర్తించలేకుండా వున్నారు. విజయం ప్రజలది కాదనీ, చర్చిల్ దేననీ, వీరి అభిప్రాయం. వీరి రాజకీయ గ్రుడ్డితనమంతా ఈ విషయంలో బయట పడుతోంది. విజయం చర్చిల్ ది కాబట్టి ఇక మనదేశానికి స్వతంత్రం రాదని కాంగ్రెసువాదులంటున్నారు. అది సరికాదు. ప్రపంచ ప్రజలయొక్క ఈ అఖండ విజయంవల్ల మన స్వాతంత్ర్యం దగ్గరపడింది. శాన్ఫ్రాన్సిస్కోలో మాలటోవ్ బానిసప్రజల విముక్తికై తీవ్రంగా కృషిచేస్తున్నాడు. ఇంగ్లండులో ప్రజలు భారతదేశానికి స్వాతంత్ర్యం యివ్వాలంటున్నారు. ఈ పరిస్థితులలో మనదేశంలోకూడా కాంగ్రెసు-లీగు-నిమ్నజాతులసభ కలియాలి. హిందూ - ముస్లిం ఐక్యత సాధించాలి. అలా జరిగితేనే మనం స్వాతంత్ర్యాన్ని పొందగలుగుతాం. లేకుంటే బానిసత్వమే గతి."

సంఘబలాన్ని వృద్ధిచేసుకోవాలి.

తరువాత మహాసభాధ్యక్షులు కామ్రేడ్ ముక్కాముల నాగభూషణంగారు ఆంధ్ర రాష్ట్రమందలి రైతుఉద్యమాన్ని, సాధించిన విజయాలనూ చెప్పి, యిలా అన్నారు. "సోదరులారా ! మన సంఘబలాన్ని ఇంకా యెన్నోరెట్లు వృద్ధిచేసుకోవాలి. మన నదులకు ఆనకట్టలు, కాలువలూ,చెరువులూ, మరమ్మతు చేయాలని ఆందోళనచేయాలి. మన వేరుశనగ, ప్రత్తి పంటలకు కొనే దిక్కు లేకుండాఉంది. ఈ పంటలను ప్రభుత్వమే కొనాలి. ఇందుకొరకై మనం తీవ్రంగా ఆందోళనచేయాలి. ధర్మవరం, కళ్యాణదుర్గ తాలూకాలలో కరువు నివారణకు ప్రభుత్వం పూనుకొనేలాచేయాలి. వ్యవసాయపనిముట్లూ, ఎరువులూ, విత్తనాలూ వ్యవసాయశాఖద్వారా విరివిగా సప్లయి కావాలి. పశుసంపదను వృద్ధిచేయాలి. అధిక పంటలను పండించాలి. మన ప్రాంతాల్లోని కరువుకాటకాలను అరికట్టాలంటే రైతులంతా వ్యాపారపంటలను సాధ్యమైనంత వరకు తగ్గించి ఆహారపంటలను వేయాలి. ఆలా చేస్తే ప్రత్తి, వేరుశనగ(మిగత 11 వ పేజీలో)

మా విలేఖరి

Editor : M. Chandrasekhara Rao, Printed and Published by Katragadda Rajagopala Rao at Prajasakti Press, Governorpet - Bezwada.

END OF ISSUE